



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | ప్రశ్నించడం మన హక్కు







సంపుటి : 9 సంచిక : 151 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : కాకినాడ | గురువారం 5 ఫిబ్రవరి 2026 | వెల : 1/-రూ ॥

VOLUME :9 ISSUE : 151 PAGES :8 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : KAKINADA | THU 5 FEBRUARY 2026 | PRICE : 1/- RS

Simultaneously Published form Kakinada,Ongole,Visakhapatnam,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


## ముగిసిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ భేటీ

### రెండున్నర గంటలపాటు సాగిన చంద్రబాబు, పవన్ కల్యాణ్ సమావేశం

- వైసీపీ కుట్రలు, కూటమి సమన్వయంపై ప్రధానంగా చర్చ
- రాజ్యసభ స్థానాలు, నామినేటెడ్ పదవుల భర్తీపై సమాలోచనలు
- క్షేత్రస్థాయిలో ఉమ్మడి కార్యాచరణకు నిర్ణయం



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మధ్య అమరావతిలో జరిగిన కీలక భేటీ ముగిసింది. ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో ఈ సమావేశం సుమారు రెండున్నర గంటల పాటు కొనసాగింది. రాష్ట్రంలో తాజా రాజకీయ పరిణామాలు, కూటమి పక్షాల మధ్య సమన్వయం, భవిష్యత్ కార్యాచరణ వంటి అనేక కీలక అంశాలపై ఇరువురు నేతలు సుదీర్ఘంగా చర్చించారు.ప్రధానంగా, వైసీపీ అనుసరిస్తున్న వైఖరి పైనే ఈ సమావేశంలో ఎక్కువగా చర్చ జరిగినట్లు తెలుస్తోంది. కుల రాజకీయాలను రెచ్చగొట్టడం ద్వారా వైసీపీ లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తోందని, ఆ పార్టీ పన్నుతున్న వ్యూహాలను సమర్థవంతంగా ఎదుర్కో వాలని ఇరువురు నేతలు నిర్ణయించుకున్నారు. వైసీపీ ట్రాప్‌లో పడకుండా కూటమి శ్రేణులను అప్రమత్తం చేసేందుకు ఉమ్మడి వ్యూహంతో ముందుకు సాగాలని తీర్మానించుకున్నారు. క్షేత్రస్థాయిలో టీడీపీ, జనసేన కార్యకర్తల మధ్య వైసీపీ చిచ్చు పెట్టేందుకు ప్రయత్నిస్తోందని, అందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఇరువురు నేతలు ఓ అభిప్రాయానికి వచ్చారు.ఈ భేటీలో రాజకీయ అంశాలతో పాటు పరిపాలనాపరమైన విషయాలు కూడా ప్రస్తావనకు వచ్చాయి. త్వరలో ఖాళీ కానున్న నాలుగు రాజ్యసభ స్థానాల భర్తీపై నేతలు ప్రాథమికంగా చర్చించినట్లు సమాచారం. అలాగే, చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియను వేగవంతం చేయాలని కూడా నిర్ణయించినట్లు తెలుస్తోంది. వివిధ కార్పొరేషన్లకు ఛైర్మన్లతో పాటు డైరెక్టర్ల నియామకంపై కూడా సమాలోచనలు జరిపారు. టీడీపీ, జనసేన, బీజేపీ మధ్య క్షేత్రస్థాయిలో సమన్వయం మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఈ సమావేశంలో అభిప్రాయానికి వచ్చినట్లు తెలుస్తోంది. తిరుమల లడ్డూ ప్రసాదం వంటి అంశాలపై వైసీపీ సోషల్ మీడియాలో చేస్తున్న విష ప్రచారాన్ని

- మిగతా 2లో



## ఆ విషయం తెలియని వాళ్లు నాకు క్యాన్సర్ అని రాశారు

- క్యాన్సర్‌పై అవగాహన పెంచాలని మెగాస్టార్ పిలుపు
- నిర్లక్ష్యం వల్లే ముప్పు.. ముందస్తు గుర్తింపుతోనే రక్షణ
- తనకు జరిగిన కోలనోస్కోపీ టెస్టుపై ఆసక్తికర వ్యాఖ్యలు
- అవగాహన కోసం షార్ట్ ఫిలిమ్స్ తీస్తానన్న చిరంజీవి

- మిగతా 2లో

## రాష్ట్రంలో జంగిల్ రాజ్ నడుస్తోంది



- అంబటి రాంబాబు ఇంటికి వెళ్లిన జగన్... కూటమి ప్రభుత్వంపై ఆగ్రహం
- మాజీ మంత్రి అంబటి రాంబాబు కుటుంబాన్ని పరామర్శించిన జగన్
- మూడేళ్లలో తిరిగి అధికారంలోకి వస్తామని కూటమికి ఘాటు హెచ్చరిక
- టీడీపీ శ్రేణుల దాడిలో ధ్వంసమైన అంబటి ఇంటిని, వాహనాలను పరిశీలన
- తిరుమల నెయ్యి వివాదంపై స్పందిస్తూ చంద్రబాబుపై విమర్శలు

పెన్ పవర్ డెస్క్: గుంటూరులో మాజీ మంత్రి అంబటి రాంబాబు కుటుంబాన్ని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయిపోయిందని, జంగిల్ రాజ్ నడుస్తోందని జగన్ తీవ్రంగా విమర్శించారు. దాడులు చేసిన వారిని వదిలేసి, బాధితులపైనే కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.బుధవారం నాడు గుంటూరు పర్యటనలో భాగంగా, ఇటీవల దాడికి గురైన అంబటి నివాసానికి వెళ్లిన జగన్, ధ్వంసమైన ఇంటిని, వాహనాలను పరిశీలించారు. గుడి నుంచి వస్తున్న అంబటిపె

- మిగతా 2లో



## మాకంటే వారి వద్దే శక్తిమంతమైన ఆయుధాలు

- బలూచ్ తిరుగుబాటుదారుల వద్ద అమెరికన్ అడ్వాన్స్‌డ్ ఆయుధాలు ఉన్నాయి
- బలూచ్ తిరుగుబాటుదారుల వద్ద ఉన్న ఆయుధాలు తమ సైన్యంలో కూడా లేవన్న ఆసిఫ్
- ఈ ఆయుధాలు వారికి ఎక్కడి నుంచి వస్తున్నాయన్న పాక్ రక్షణ మంత్రి
- వీరిపై పాక్ సైన్యం పూర్తి స్థాయిలో దాడి చేస్తుందని వెల్లడి

- మిగతా 2లో



## పవన్ ఆంధ్రాలో రాజకీయాలు చేసుకోవాలి..

### ఇక్కడ ఆయన మాట విని ఓటేసే వారు లేరు: మహేశ్ గౌడ్

- తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ తరఫున పవన్ ప్రచారం చేస్తారంటూ వార్తలు
- పవన్ తెలంగాణ వ్యతిరేకి అని ఆరోపించిన మహేశ్ గౌడ్
- పవన్‌ను బీజేపీ నేతలు 'భిక్షాం దేహీ' అని అడిగారంటూ ఎద్దేవా

- మిగతా 2లో

## 2.5 కోట్ల ఆధార్ కార్డులను డీయాక్టివేట్ చేసిన కేంద్రం

- గుర్తింపు మోసాలను అరికట్టేందుకు కేంద్రం చర్యలు
- దేశవ్యాప్తంగా మరణించిన 2.5 కోట్ల మంది ఆధార్ నంబర్ల రద్దు
- పార్లమెంటులో వెల్లడించిన కేంద్ర మంత్రి జితిన్ ప్రసాద
- ఆధార్ భద్రతకు బయోమెట్రిక్ లాక్, ఫేస్ అథెంటికేషన్ ఫీచర్లు
- డేటాబేస్ శుద్ధీకరణలో భాగంగా యూఐడీఏఐ ఈ నిర్ణయం

- మిగతా 2లో




## ఎన్‌హెచ్‌ఆర్‌సీని ఆశ్రయించిన వైసీపీ

- ఏపీలో తమ నేతలపై దాడులంటూ ఎన్‌హెచ్‌ఆర్‌సీకి ఫిర్యాదు
- మాజీ మంత్రుల ఇళ్లపై దాడులు, దళిత కార్యకర్త హత్యపై విచారణకు విజ్ఞప్తి
- రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, రాజ్యాంగ వ్యవస్థ బలహీనపడిందని ఆరోపణ
- తమ ఫిర్యాదుపై కమిషన్ సానుకూలంగా స్పందించిందని తెలిపిన వైసీపీ నేతలు
- ఏపీకి నిజనిర్ధారణ కమిటీని పంపే అవకాశం ఉందని వెల్లడి

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లో తమ పార్టీ నేతల ఇళ్లపై జరిగిన దాడులు, ఒక దళిత కార్యకర్త హత్య ఘటనలపై వైసీపీ జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ)ని ఆశ్రయించింది. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా విఫలమయ్యాయని, మానవ హక్కుల ఉల్లంఘనలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ సమగ్ర విచారణ జరపాలని కోరింది.బుధవారం నాడు ఢిల్లీలో వైసీపీ బృందం ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఛైర్‌పర్సన్ జస్టిస్ వి. రామసుబ్రమణియన్‌ను

- మిగతా 2లో





## ప్రభుత్వాలు శాశ్వతం కాదు

### రాజ్యసభలో కమల్ హాసన్ తొలి ప్రసంగం

- రాజ్యసభలో తొలిసారి ప్రసంగించిన నటుడు, ఎంపీ కమల్ హాసన్
- సినిమా ద్వారానే తాను పార్లమెంటుకు వచ్చానని వెల్లడి
- ఏ ప్రభుత్వమూ శాశ్వతం కాదని, అధికారం అశాశ్వతమని వ్యాఖ్య
- ద్రావిడ నేతలు పెరియార్, అన్నాదురైలను గుర్తు చేసుకున్న కమల్
- ప్రగతిశీల ప్రజాస్వామ్యంతో యువత ఎదగాలని పిలుపు

ప్రముఖ నటుడు, మక్కల్ నీది మయ్యం (వీఎంవీ) అధినేత కమల్ హాసన్ రాజ్యసభలో తన తొలి ప్రసంగంతో ఆకట్టుకున్నారు. బుధవారం నాడు బడ్జెట్ సమావేశాల్లో

- మిగతా 2లో



## వెనుకబడిన వర్గాలను మైక్రో ఎంట్రప్రెన్యూర్లుగా తీర్చిదిద్దాలి

- ఆదరణ-3 ద్వారా కులవృత్తులకు ఆధునిక పరికరాల పంపిణీకి చర్యలు
- రూ.60 కోట్ల సాస్కీ నిధులతో బీసీ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణం
- బీసీ హాస్టళ్లలో మార్చిలోగా ఆర్వో ప్లాంట్ల ఏర్పాటుకు నిర్ణయం
- 6 జ్యోతిరావు పూలే రెసిడెన్షియల్ స్కూళ్లను జూనియర్ కాలేజీలుగా అప్‌గ్రేడ్

- మిగతా 2లో

వెనుకబడిన వర్గాలను (బీసీ) కేవలం సంక్షేమ లబ్ధిదారులుగా పరిమితం చేయకుండా, వారిని సూక్ష్మ పారిశ్రామికవేత్తలుగా (మైక్రో ఎంట్రప్రె న్యూర్లు), ఎంఎస్ఎంఈలుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఇందుకు అనుగుణంగా పటిష్టమైన కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. బుధవారం సచివాలయంలో బీసీ సంక్షేమ శాఖపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. కులవృత్తుల వారికి ఆధునిక సాంకేతికతను అందించే లక్ష్యంతో 'ఆదరణ-3' పథకం ద్వారా ఆధునిక పనిముట్లను పంపిణీ చేసేందుకు వెంటనే చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. విద్యా రంగంలో బీసీ విద్యార్థులకు అత్యుత్తమ మౌలిక వసతులు కల్పించడంపై

## తెలుగు రాష్ట్రాల్లో భారీగా ఎయిడ్స్ మరణాలు..




### ఐటీ రంగంలో విస్తరిస్తున్న హెచ్ఐవీ

- 2020-24 మధ్య కాలంలో ఎయిడ్స్ కారణంగా దేశ వ్యాప్తంగా 1.81 లక్షల మంది మృతి
- ఏపీలో 32,642 మంది... తెలంగాణలో 11,498 మంది మృతి
- విదేశీ తరహా జీవనశైలి వల్ల ఐటీ రంగంలో విస్తరిస్తున్న వైరస్

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# సామాన్యుడికి అభయం లేని బడ్జెట్!

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ దీర్ఘకాలిక ప్రణాళికల్ని చూపిస్తూ.. 'సామాన్యులను ప్రస్తుతానికి ఇలాగే సర్దుకోండి' అన్నట్టు ఉంది. ఆర్థిక సర్వే ప్రకారం దేశ ఆర్థిక వ్యవస్థ నిలకడగా, పటిష్టంగా ఉంది. కనుక ఆ ప్రభావంతో బడ్జెట్‌లో ప్రజలకు నేరుగా మంచి ప్రయోజనాలు ఉండొచ్చని ఆశించిన వారికి భంగపాటు అయింది. ఈసారి ద్రవ్యలోటుని అదుపులో ఉంచడం, రానున్న రోజుల్లో స్థూల ఆర్థిక వ్యవస్థను బలీయంగా ఉంచడానికి ప్రయత్నించడమన్నవి ప్రాధాన్యతలుగా మారి, సంక్షేమం, ఆర్థిక సమానత్వంతో కూడిన వృద్ధి అన్నవి వెనక బడ్డాయి.. జన సామాన్యానికి కొత్త పథకాలు, అభయం ఇచ్చే హామీలు, కేటాయింపులు లేవు.. దేశీయ మౌలిక వసతులు ఏర్పాటు, పరిశ్రమలకు ఊతం కల్పిస్తూ మూలధన వ్యయం పెంచుతున్నట్లు ప్రకటించారు.. ఆ దిశగా 12 లక్షల కోట్లు ప్రతిపాదన చెయడం ఇదే మొదటిసారి.. చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ప్రోత్సాహం బాగుంది. కానీ ఎగుమతుల విషయంలో ప్రపంచ పరిణామాల మధ్య ఎంతమేరకు వర్కవుట్ అవుతుందో చూడాలి. బడ్జెట్‌లో తలపెట్టిన హై స్పీడ్ కారిడార్లు, ఖనిజ కారిడార్లు, పర్యాటక రంగంపై ఫోకస్ ద్వారా అవి తెచ్చే లాభాలకు, పరోక్షంగా వాటివల్ల ప్రజలకు, పర్యావరణానికి, హక్కులకు కలిగే నష్టాలతో బేరీజు వేసి వాస్తవ స్థితిని చూడాల్సి ఉంటుంది. విద్యా, నైపుణ్య రంగాలకు కేటాయింపులు బాగానే ఉన్నా, భవిష్యత్‌ని, ఉపాధిలేమి, నిరుద్యోగితని దృష్టిలో పెట్టుకుంటే ఇంకా చాలా అవసరం. విద్యా వైద్య రంగాలకు కేటాయింపులు అవసరమైన స్థాయిలో లేవు.. బడుగు వర్గాల సంక్షేమం కూడా ఆశించిన స్థాయిలో కేటాయింపులను నోచుకోలేదు.. రాష్ట్రాలకు పన్నుల్లో వాటా పెంచాల్సింది. సంపన్నులకు కొంచెం బాధ్యత పెంచి, సామాన్యులకు కొంచెం భారం తగ్గిస్తే దేశ ఆర్థిక వ్యవస్థకు కూడా మంచి జరిగేది. మొత్తానికి త్రీడీ కళ్లద్దాలతో చూస్తే దారి చివర నున్నటి భవనం. కానీ నడవ డానికి మాత్రం గతుకుల రోడ్డు ఉన్నట్టుంది.

# వెనుకబడిన వర్గాలను మైక్రో ఎంట్రప్రెన్యూర్లుగా తీర్చిదిద్దాలి

- మొదటి పేజీ తరువాయి
సమీక్షలో ప్రధానంగా చర్చించారు. రాష్ట్రంలో రూ.60 కోట్ల సాస్కీ నిధులతో కొత్తగా బీసీ రెసిడెన్షియల్ పాఠశాలలు, హాస్టళ్ల నిర్మాణాన్ని చేపట్టాలని సీఎం ఆదేశించారు. ఇప్పటికే ఉన్న 814 బీసీ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు సురక్షితమైన తాగునీరు అందించేందుకు రూ.17 కోట్ల వ్యయంతో మార్చిలోగా ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేస్తామని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. హాస్టళ్లలో పారిశుధ్యం, విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యత విషయంలో ఏమాత్రం రాజీ పడొద్దని, అత్యుత్తమ ప్రమాణాలు పాటించాలని చంద్రబాబు స్పష్టం చేశారు.
విద్యార్థుల ఆరోగ్యం, విద్యాబోధన వంటి అన్ని అంశాల్లోనూ ఉత్తమ పద్ధతులను (బెస్ట్ ప్రాక్టీసెస్) అనుసరించాలని సూచించారు. విద్యార్థుల విద్యాపరమైన పురోగతిని పర్యవేక్షించేందుకు వీలుగా అపార్ (ూూూూ=) ఐడీలను నమోదు చేసి, అనుసంధానం చేయాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణ దశలో ఉన్న బీసీ భవనాల పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే పేరుతో నడుస్తున్న 6 రెసిడెన్షియల్ పాఠశాలలను జూనియర్ కళాశాలల స్థాయికి అప్‌గ్రేడ్ చేయాలని నిర్ణయించారు. రాబోయే రోజుల్లో ప్రతి నియోజకవర్గంలో ఒక బీసీ రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటు చేసే ఆలోచన ఉందని ముఖ్యమంత్రి వెల్లడించారు. బీసీ స్టడీ సర్కిళ్లను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని, కూటమి ప్రభుత్వం వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని, వారికి ప్రయోజనం చేకూరేలా పథకాలు రూపొందించాలని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

# ఆ విషయం తెలియని వాళ్లు నాకు క్యాన్సర్ అని రాశారు

ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్ కిమ్స్ ఆసుపత్రిలో జరిగిన ఓ కార్యక్రమంలో మెగాస్టార్ చిరంజీవి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన క్యాన్సర్‌పై అవగాహన, ముందస్తు గుర్తింపు ప్రాధాన్యత గురించి మాట్లాడుతూ, కొన్ని కీలకమైన వ్యక్తిగత అనుభవాలను పంచుకున్నారు. క్యాన్సర్‌పై పోరాటాన్ని ఒక ఉద్యమంలా చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా తన ఆరోగ్యం గురించి ఓ ఆసక్తికర విషయాన్ని చిరంజీవి వెల్లడించారు. తాను ఎంతో ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటిస్తానని, అయినా ముందుజాగ్రత్తగా కోలనోస్కోపీ పరీక్ష చేయించుకున్నానని తెలిపారు. ఆ పరీక్షలో నాన్-క్యాన్సరస్ పాలిప్స్ (అశీఅ-ఝఅఎవతీశీబం జూశీశ్రీఎజూం) కనపడటంతో వాటిని తొలగించారని చెప్పారు. అయితే, దీనిపై అవగాహన లేని కొందరు జర్నలిస్టులు తనకు క్యాన్సర్ వచ్చిందని, దాని నుంచి బయటపడ్డానని రాశారని, అది వాస్తవం కాదని స్పష్టం చేశారు. క్యాన్సర్‌గా మారే చిన్న అవకాశాన్ని కూడా తీసుకోకూడదనే ఉద్దేశంతోనే ఆ పరీక్ష చేయించుకున్నానని అన్నారు. అలాగే, తాను క్రమం తప్పకుండా పీఎస్‌ఏ (ూూూ) వంటి పరీక్షలు చేయించుకుంటూ ఉంటానని తెలిపారు. శరీరం చెప్పే మాటను వినాలని, 'నాకు రాదులే' అనే నిర్లక్ష్యం పనికిరాదని చిరంజీవి గట్టిగా చెప్పారు. తన స్నేహితుడు ఒకరు లంగ్ క్యాన్సర్ బారిన పడినా, తొలిదశలోనే గుర్తించడం వల్ల చికిత్సతో బయటపడి గత పదేళ్లుగా ఆరోగ్యంగా జీవిస్తున్నారని ఉదహరించారు. జీవనశైలి, వాతావరణం, వంశపారంపర్య కారణాల వల్ల ఎవరికైనా క్యాన్సర్ రావొచ్చని, కానీ 90 శాతం కేసుల్లో తొలిదశలో గుర్తిస్తే నయం చేయవచ్చని వివరించారు.
ముఖ్యంగా మహిళల ఆరోగ్యంపై దృష్టి సారించాలని చిరంజీవి కోరారు. 9 నుంచి 14 ఏళ్లలోపు బాలికలకు హెచ్‌పీవీ (నూఎ) వ్యాక్సిన్ వేయిస్తే, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ (ఎవతీఙఱషaశ్రీ ఝఅఎవతీ) బారిన పడకుండా 100 శాతం రక్షించవచ్చని వైద్యులు చెబుతున్నారని గుర్తుచేశారు. 45 ఏళ్లలోపు మహిళలు కూడా ఈ వ్యాక్సిన్ తీసుకోవడం మంచిదని సూచించారు. తరచూ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా గర్భాశయ సంబంధిత సమస్యలను కూడా ముందుగానే గుర్తించవచ్చని ఆయన అన్నారు. భారత్‌లో ప్రతి సంవత్సరం 14 లక్షల కొత్త క్యాన్సర్ కేసులు నమోదవుతున్నాయని, ప్రతి నిమిషానికి ముగ్గురు ఈ వ్యాధి బారిన పడుతున్నారని గణాంకాలు చెబుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిని మార్చాలంటే పోలియో, మశూచి నిర్మూలన తరహాలో క్యాన్సర్‌పై కూడా ఒక ఉద్యమంలా పోరాడాలని పిలుపునిచ్చారు. పొగాకు, ధూమపానం వంటి దురలవాట్లకు దూరంగా ఉండాలని హితవు పలికారు. క్యాన్సర్‌పై ప్రజల్లో అవగాహన పెంచేందుకు తనవంతు బాధ్యతగా భవిష్యత్తులో షార్ట్ ఫిలిమ్స్ నిర్మించడానికి సిద్ధంగా ఉన్నానని చిరంజీవి ప్రకటించారు. ప్రఖ్యాత క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ నోరి దత్తాత్రేయుడిని కలిసిన కొద్దిరోజులకే కిమ్స్ నుంచి ఆహ్వానం రావడం దైవ సంకల్పంగా భావించానని, అందుకే వెంటనే అంగీకరించానని తెలిపారు.

# 2.5 కోట్ల ఆధార్ కార్డులను డీయాక్టివేట్ చేసిన కేంద్రం

గుర్తింపు మోసాలను అరికట్టే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. దేశవ్యాప్తంగా మరణించిన 2.5 కోట్లకు పైగా వ్యక్తుల ఆధార్ నంబర్లను డీయాక్టివేట్ చేసినట్లు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద బుధవారం పార్లమెంటుకు తెలిపారు. ఆధార్ డేటాబేస్ కచ్చితత్వాన్ని, సమగ్రతను కాపాడేందుకు దేశవ్యాప్తంగా చేపట్టిన శుద్ధీకరణ కార్యక్రమంలో భాగంగా ఈ చర్యలు తీసుకున్నట్లు ఆయన వివరించారు. ప్రపంచంలోనే అతిపెద్ద బయోమెట్రిక్ గుర్తింపు వ్యవస్థ అయిన ఆధార్ సుమారు 134 కోట్ల మంది వినియోగదారులను కలిగి ఉంది. మరణించిన వారి ఆధార్ నంబర్లను దుర్వినియోగం చేసి సంక్షేమ పథకాలను పొందడం, ఇతర మోసాలకు పాల్పడటం వంటివి నిరోధించడానికి ఈ డీయాక్టివేషన్ ప్రక్రియ చాలా అవసరమని మంత్రి పేర్కొన్నారు.
ఆధార్ దుర్వినియోగాన్ని తగ్గించడానికి భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (ఖ×ఱూ×) అనేక భద్రతా చర్యలు తీసుకుంటున్నట్లు జితిన్ ప్రసాద తెలిపారు. ఇందులో భాగంగా వినియోగదారులు తమ బయోమెట్రిక్స్‌ను లాక్/అన్‌లాక్ చేసుకునే సదుపాయం, లావాదేవీల సమయంలో లబ్ధిదారు భౌతికంగా ఉన్నట్లు నిర్ధారించే 'లైవ్‌నెస్ డిటెక్షన్' ఫీచర్‌తో కూడిన ఫేస్ అథెంటికేషన్, ఆధార్ సెక్యూర్ క్యూఆర్ కోడ్, ఆఫ్‌లైన్ ఈ-కేవైసీ వంటివి అందుబాటులోకి తెచ్చినట్లు వివరించారు. వినియోగదారుల ప్రధాన బయోమెట్రిక్ సమాచారాన్ని యూఐడీఏఐ ఎవరితోనూ పంచుకోదని, డేటాను ఎన్‌క్రిప్టెడ్ ఫార్మాట్‌లో భద్రపరచడం తప్పనిసరి చేసిందని ఆయన స్పష్టం చేశారు.

# ప్రభుత్వాలు శాశ్వతం కాదు

- మొదటి పేజీ తరువాయి
భాగంగా రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చలో ఆయన పాల్గొన్నారు. ఏ ప్రభుత్వమూ శాశ్వతం కాదని, అధికారం ఎవరికీ శాశ్వతం కాదనే విషయాన్ని గుర్తుంచుకోవాలని ఆయన హితవు పలికారు. "వివిధ రంగాలకు చెందిన వారు తమ ప్రజల తరఫున మాట్లాడేందుకు ఈ సభలోకి ప్రవేశించడానికి అనేక ద్వారాలు తెరుచుకుంటాయి. నాకు మాత్రం సినిమా ద్వారా ఆ ద్వారం తెరుచుకుంది" అని కమల్ హాసన్ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. తనకు మద్దతిచ్చిన తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పెరియార్, సి.ఎన్. అన్నాదురై, మహాత్మా గాంధీ వంటి మహనీయుల ప్రభావం తన ఆలోచనలు, రాజకీయాలపై ఉందని పేర్కొన్నారు.
"మా భాష, సంస్కృతి, హక్కులపై ఎలాంటి దాడి జరిగినా ఎదుర్కోవాలని నేర్పిన సి.ఎన్. అన్నాదురై నాకు తమిళాన్ని పరిచయం చేశారు" అని కమల్ గుర్తుచేసుకున్నారు. ప్రజాస్వామ్యంపై మాట్లాడుతూ, "ఈ ప్రజాస్వామ్య రథం భేదాభిప్రాయాలను అధిగమించి ముందుకు సాగాలి కానీ, ప్రజలను అణచివేయకూడదు. దానిని మేము అనుమతించం" అని హెచ్చరించారు.
ప్రపంచ చరిత్రలో ఏ ప్రభుత్వమూ శాశ్వతంగా నిలవలేదని, ప్రస్తుత ప్రభుత్వం కూడా అందుకు అతీతం కాదని స్పష్టం చేశారు. "పిల్లలు గమనిస్తున్నారు, జెన్-జీ తరం చూస్తోంది. ఎదుగుతున్న ప్రగతిశీల ప్రజాస్వామ్యంతో పాటు వారిని కూడా ఎదగనివ్వండి. అప్పుడే రేపటి భవిష్యత్తు మనదవుతుంది" అని యువతకు పిలుపునిచ్చారు. కమల్ హాసన్ ప్రసంగానికి సభ్యుల నుంచి మంచి స్పందన లభించింది.

# ఎన్‌హెచ్ఆర్‌సీని ఆశ్రయించిన వైసీపీ

- మొదటి పేజీ తరువాయి
కలిసి ఫిర్యాదు అందజేసింది. మాజీ మంత్రులు అంబటి రాంబాబు, జోగి రమేశ్ ఇళ్లపై జరిగిన దాడులతో పాటు, దళిత కార్యకర్త హత్యకు సంబంధించిన వివరాలను కమిషన్‌కు సమర్పించింది. టీడీపీ శ్రేణులు పథకం ప్రకారమే ఈ దాడులకు పాల్పడ్డాయని, ప్రతిపక్ష నేతలను భౌతికంగా అంతమొందించే ప్రయత్నాలు చేశారని ఆరోపించారు. ఇందుకు సంబంధించిన వీడియోలు, ఫొటోలను ఆధారాలుగా అందజేశారు.

సమావేశం అనంతరం వైసీపీ నేతలు మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో దళితులపై దాడులు పెరిగాయని, మాజీ మంత్రులపై పెట్రోల్ బాంబులతో దాడికి యత్నించారని మాజీ మంత్రి మేరుగు నాగార్జున ఆవేదన వ్యక్తం చేశారు. దాడులు జరుగుతున్న సమయంలో పోలీసులు ప్రేక్షకపాత్ర పోషించారని, రాష్ట్రంలో రాజ్యాంగ వ్యవస్థ బలహీనపడిందని ఆదిమూలపు సురేష్ విమర్శించారు. కొందరు నేతలు రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేశారు.
తమ ఫిర్యాదుపై ఎన్‌హెచ్ఆర్‌సీ ఛైర్‌పర్సన్ సానుకూలంగా స్పందించారని వైసీపీ నేతలు తెలిపారు. ఏపీ డీజీపీ నుంచి నివేదిక కోరడంతో పాటు, వాస్తవాలను తెలుసుకునేందుకు ఒక నిజనిర్ధారణ బృందాన్ని రాష్ట్రానికి పంపే అవకాశం ఉందని వారు వెల్లడించారు. ఈ బృందంలో ఎంపీలు వైవీ సుబ్బారెడ్డి, మిథున్ రెడ్డి, గురుమూర్తి, మాజీ మంత్రులు తదితరులు ఉన్నారు. హత్యకు గురైన దళిత కార్యకర్త సల్మాన్ సోదరుడు కూడా తమ గ్రామంలో శాంతిని కాపాడాలని కమిషన్‌ను కోరారు.

# ముగిసిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ భేటీ

- మొదటి పేజీ తరువాయి
సమష్టిగా తిప్పికొట్టాలని, ఇందుకోసం కూటమిలోని మూడు పార్టీల నేతలు కలిసి ఉమ్మడి మీడియా సమావేశాలు నిర్వహించాలని పవన్ సూచించినట్లు సమాచారం. రాబోయే 15 ఏళ్లు కూటమే అధికారంలో కొనసాగేలా పటిష్టమైన భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకోవాలనే దిశగా కూడా వీరి మధ్య చర్చలు సాగినట్లు తెలుస్తోంది. నిన్న కేబినెట్ భేటీకి ముందు
చంద్రబాబు, పవన్ క్లుప్తంగా మాట్లాడుకున్నప్పటికీ, అన్ని అంశాలపై విపులంగా చర్చించేందుకు ఈరోజు ప్రత్యేకంగా భేటీ అయ్యారు.

# పవన్ ఆంధ్రాలో రాజకీయాలు చేసుకోవాలి..

ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. పవన్ ఒక ఆంధ్ర నాయకుడని, ఆయన తెలంగాణ వ్యతిరేకి అని ఘాటుగా వ్యాఖ్యానించారు. పవన్ తన రాజకీయాలను ఆంధ్రాలోనే చేసుకోవాలని, తెలంగాణలో ఆయన ప్రచారం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని స్పష్టం చేశారు. తెలంగాణలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి మద్దతుగా పవన్ కల్యాణ్ ప్రచారం చేస్తారనే వార్తలు వస్తున్న నేపథ్యంలో మహేశ్ గౌడ్ ప్రాధాన్యత సంతరించుకున్నాయి. "బీజేపీ నేతలు పవన్ కల్యాణ్‌ను భిక్షాం దేహీ అని అడిగారు" అని ఆయన ఎద్దేవా చేశారు. గతంలో పవన్ తెలంగాణ గురించి చాలా నీచంగా మాట్లాడారని, అలాంటి వ్యక్తి మాటలు విని ఇక్కడి ప్రజలు ఓట్లు వేయరని అన్నారు. ఆయన మాటలను ఎవరూ విశ్వసించరని, ఆయన ప్రభావం తెలంగాణ రాజకీయాలపై శూన్యమని స్పష్టం చేశారు.

# రాష్ట్రంలో జంగిల్ రాజ్ నడుస్తోంది

- మొదటి పేజీ తరువాయి
టీడీపీ కార్యకర్తలు కర్రలు, రాడ్లతో దాడి చేశారని, పోలీసుల సమక్షంలోనే కార్లను పగలగొట్టారని ఆరోపించారు. బాధితుడైన అంబటిని అరెస్ట్ చేసి, దాడి చేసిన వారికి స్టేషన్ బెయిల్ ఇవ్వడం దారుణమని అన్నారు.
ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ, "ఇలాంటి దాడులతో వైసీపీ నాయకులను భయపెట్టగలమనుకుంటే మీ అంత మూర్ఖుడు లేడు. ఎల్లకాలం ఇదే ప్రభుత్వం ఉండదు. మూడేళ్లలో మా ప్రభుత్వం వస్తుంది. అప్పుడు వడ్డీతో సహా చెల్లిస్తాం" అంటూ చంద్రబాబు ప్రభుత్వానికి ఘాటు వార్నింగ్ ఇచ్చారు. చేసిన తప్పులకు చంద్రబాబు, పవన్ కల్యాణ్, నారా లోకేశ్ లెక్కలు చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు. అనంతరం తిరుమల నెయ్యి వివాదంపై కూడా జగన్ స్పందించారు. నెయ్యిలో ఎలాంటి కల్తీ జరగలేదని ల్యాబ్ నివేదికలు స్పష్టం చేశాయని, కేవలం తిరుమల ప్రతిష్ఠను దెబ్బతీసేందుకే చంద్రబాబు కుట్రపూరితంగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.

# మాకంటే వారి వద్దే శక్తిమంతమైన ఆయుధాలు

పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ బలూచిస్థాన్‌లో జరుగుతున్న తిరుగుబాటు దాడులపై సంచలన వ్యాఖ్యలు చేశారు. బలూచ్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) తిరుగుబాటుదారుల దగ్గర అమెరికన్ అడ్వాన్స్‌డ్ ఆయుధాలు ఉన్నాయని, అవి పాక్ సైన్యంలో కూడా లేవని ఆయన జాతీయ అసెంబ్లీలో కీలక ప్రకటన చేశారు. ఆసిఫ్ మాట్లాడుతూ, తిరుగుబాటుదారుల దగ్గర ఒక్కొక్కటి రూ.20 లక్షల విలువైన రైఫిల్స్, 4,0005,000ల డాలర్ల విలువైన థర్మల్ వెపన్ సైట్స్, నైట్ విజన్ డివైసెస్ ఉన్నాయని వెల్లడించారు. "ఇలాంటి రైఫిల్ మన సైన్యంలో లేదు. ఈ అమెరికన్ ఆయుధాలు వారికి ఎక్కడి నుంచి వస్తున్నాయి? ఎవరు డబ్బు చెల్లిస్తున్నారు?" అని ఆయన ప్రశ్నించారు. బలూచ్ తిరుగుబాటుదారుల నాయకత్వం ఆఫ్ఘనిస్థాన్‌లో ఉందని, అక్కడి నుంచే తిరుగుబాటుదారులకు మద్దతు అందుతోందని ఆసిఫ్ ఆరోపించారు. బలూచిస్థాన్ ప్రావిన్స్ పరిమాణం పెద్దది కావడం, తిరుగుబాటుదారులు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ ఉపయోగించడం వల్ల భద్రతా బలగాలు కష్టపడుతున్నాయని ఆయన ఒప్పుకున్నారు. పాకిస్థానీ పంజాబీలను బీఎల్ఏ టార్గెట్ చేస్తోందని ఆసిఫ్ తెలిపారు. "వీరితో చర్చలు జరపలేము. పాక్ సైన్యం పూర్తి స్థాయిలో వారిపై దాడి చేస్తుంది" అని హెచ్చరించారు.

# తెలుగు రాష్ట్రాల్లో భారీగా ఎయిడ్స్ మరణాలు..

ఏపీ, తెలంగాణల్లో ఎయిడ్స్ మరణాలు ఆందోళనకర స్థాయిలో ఉన్నాయి. గత ఐదేళ్లలో హెచ్ఐవీ బారిన పడి మరణించిన వారి సంఖ్య ఆందోళన కలిగిస్తోంది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన గణాంకాల ప్రకారం... 2020-2024 మధ్య కాలంలో దేశ వ్యాప్తంగా 1.81 లక్షల మంది హెచ్ఐవీ కారణంగా చనిపోయారు. వీరిలో తెలుగు రాష్ట్రాల్లో మరణించిన వారి సంఖ్య 44,140గా ఉంది.
ఏపీలో 32,642 మంది చనిపోగా... తెలంగాణలో 11,498 మంది మృతి చెందారు. మరో షాకింగ్ విషయం ఏమిటంటే... ఐటీ రంగంలో హెచ్ఐవీ వైరస్ విస్తృతంగా వ్యాపిస్తోంది. ఈ విషయాన్ని జాతీయ ఎయిడ్స్ నియంత్రణ వ్యవస్థ వెల్లడించింది. విదేశీ తరహా జీవనశైలికి అలవాటు పడటం ఐటీ రంగంలో హెఐవీ వ్యాప్తి కావడానికి కారణమవుతోందని తెలిపింది. ఈ రంగంలో హెచ్ఐవీ పరీక్షల సంఖ్యలను పెంచాల్సి ఉందని సూచించింది.

పెన్ పవర్
పోలవరం - ఏలూరు
తూర్పుగోదావరి - పశ్చిమ గోదావరి

# ప్రచార ఆర్బాటంతోనే సరి...!

**సీతానగరం, పెన్ పవర్, ఫిబ్రవరి 4:** ఉపాధి హామీ పథకం అధికారులు నిర్లక్ష్యం ఎండిపోతున్న మొక్కలు. ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లో ఆక్సిజన్ పెంచండి ఆనందమయంగా జీవించండి అనే నినాదంతో ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రచార ఆర్భాటం చేసి మొక్కల పెంపకానికి శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ప్రభుత్వ పంపిణీ చేసిన మొక్కలు గ్రామాల్లో నాటకుండానే ఓ మూలన పడేవేయటం అధికారుల నిర్లక్ష్యానికి అద్ధం పడుతుంది. సీతానగరం మండలంలోని సింగవరం గ్రామపంచాయతీ పరిధిలోని విలేజ్ హెల్త్ క్లీనింగ్ సెంటర్ వద్ద మొక్కలను ఇరువైపుల నాటేందుకు గత వర్షాకాలంలో పంపిణీ చేసింది. మొక్కలను నాటకుండా పక్కన పడేయడంతో మొక్కలు ఎండిపోతున్నాయి అవి చూసిన ప్రజలు నిత్యం వాటిని గుర్తుకు తెచ్చుకుంటూ అధికారుల నిర్లక్ష్యానికి విమర్శిస్తున్నారు. గ్రామాల్లో ప్రజలకు ఆహ్లాదకరంగా పచ్చని



వాతావరణంలో ఆక్సిజన్ పెంపొందించే విధంగా ప్రభుత్వం కృషి చేస్తున్నప్పటికీ ఉపాధి హామీ పథకం సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ ఆశయం నీరుగారిపోతుంది. నిర్లక్ష్యం వహించిన సంబంధిత సిబ్బందిపై జిల్లా కలెక్టర్ తక్షణం స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

## గిరిజన ఆదివాసి కుటుంబానికి గృహ నిర్మాణ సామాగ్రి వితరణ




**జీకేసీ ట్రస్ట్ చైర్మన్ జమాల్ ఖాన్ సేవాభావం**

**చింతూరు, పెన్ పవర్ ఫిబ్రవరి 4:**చింతూరు మండలం పేగ పంచాయతీ వంకగూడెం గ్రామానికి చెందిన ఆదివాసి గిరిజన కుటుంబానికి జీకేసీ ట్రస్ట్ చైర్మన్, చింతూరు మండల టీడీపీ అధ్యక్షులు మొహమ్మద్ జమాల్ ఖాన్ మానవతా దృక్పథంతో గృహ నిర్మాణ సామాగ్రిని అందజేశారు. ఇల్లు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న మడకం లక్ష్మణ్ కుటుంబ పరిస్థితిని గ్రామస్తులు జమాల్ ఖాన్ దృష్టికి తీసుకురావడంతో ఆయన సానుకూలంగా స్పందించి ఇంటి నిర్మాణానికి అవసరమైన పది ఇనుప పైపులు, సిమెంట్ వంటి సామాగ్రిని మంగళవారం పంపిణీ చేశారు. ఈ సహాయం కుటుంబానికి ఎంతో ఉపయుక్తంగా మారిందని గ్రామస్థులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీకేసీ ట్రస్ట్ సభ్యులు జావేద్, అబ్రార్ ఖాన్, అజీజ్ ఖాన్, జాన్ సుందర్ తదితరులు పాల్గొని సేవా కార్యక్రమానికి మద్దతు తెలిపారు.

## ఎటపాక మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలి

### అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేయాలి

**చింతూరు పెన్ పవర్ 4:**రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఎటపాక మండల కేంద్రానికి సంబంధించిన పలు సమస్యలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు ఐటీడీఏ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్ కార్యక్రమంలో సబ్ కలెక్టర్, ఐటీడీఏ పీవో శుభం నొక్వాల్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎస్సీ కుటుంబాలకు స్మశాన వాటికకు భూమి కేటాయించాలని, ప్రజల ఆరోగ్య అవసరాల దృష్ట్యా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని వారు కోరారు. అదేవిధంగా మండల కేంద్రంలో ఫైర్ స్టేషన్‌తో పాటు ఒక బ్యాంకును కూడా ఏర్పాటు చేయాలని వినతిపత్రం సమర్పించారు. మండలంలో పలుచోట్ల అక్రమ ర్యాంపులు ఏర్పాటు చేసి ఇసుక అక్రమ రవాణా జరుగుతోందని నాయకులు తెలిపారు. ముఖ్యంగా గుండాల ర్యాంపు నుంచి తెలంగాణ ప్రాంతానికి అనుమతులు లేకుండా ప్రతిరోజూ ఇసుక తరలింపులు జరుగుతున్నాయని, తాత్కాలిక చర్యలు కాకుండా కఠిన చర్యలు తీసుకుని పూర్తిస్థాయిలో అడ్డుకోవాలని కోరారు. ఈ విషయాలపై స్పందించిన ఐటీడీఏ పీవో శుభం నొక్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు, స్మశాన వాటికకు



భూమి కేటాయింపుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే అక్రమ ఇసుక రవాణాపై ఇప్పటికే ఉన్నతాధికారులు, మండల అధికారులకు కఠిన చర్యలు తీసుకోవాలని సూచనలు జారీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన నాయకులు గొల్లపల్లి శివబాబు, ఎటపాక మండల ప్రధాన కార్యదర్శి దాసరి నరేష్, మండల యువజన నాయకులు గజ్జెల శ్రీనివాస్, బత్తుల మహేష్, సంఘం బాలు, గుమ్మడి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## యువత క్రీడలపై దృష్టి పెట్టాలి. జగదీశ్వరి.



**పోలవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 4.** యువత క్రీడల పై దృష్టి సారించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని రాష్ట్ర క్రీడా సాధికార సంస్థ నిర్వాహకురాలు కొవ్వాసు జగదీశ్వరి అన్నారు. కాకినాడలో జేఎన్టీయూ మైదానంలో జరుగుతున్న మహిళ, పురుషుల హాకీ టోర్నమెంట్ పోటీలను రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ అధ్యక్షులు రవి నాయుడు తో కలిసి జగదీశ్వరి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జయంతి క్రీడామైదానంలో దీర్ఘ కాలికంగా పలు సమస్యలు పెనవేసుకుని ఉన్నాయన్నారు. వాటిని క్రీడాకారులు తమ దృష్టికి తీసుకురావడంతో అధ్యక్షులు రవి నాయుడు తో కలిసి వెళ్లి వాటిని పరిశీలించి శాంతియుతంగా పరిష్కరించామన్నారు. అనంతరం కాకినాడ గోల్డ్ కప్ హాకీ టోర్నమెంట్ పోటీలను ప్రారంభించి వీక్షించమన్నారు. కార్యక్రమానికి ముందు ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని పోలవరంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. క్యాన్సర్ వ్యాధిని ప్రారంభ దశలో గుర్తించి ఉత్తమ ఫలితాలు పొందాలని రోగులకు సూచించారు. క్యాన్సర్ బారిన పడినవారు భయపడవలసిన అవసరం లేదన్నారు. ప్రభుత్వం రోగులకు కావలసిన మందులతో పాటు అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తుందని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆమె వెంట టిడిపి రాష్ట్ర ఎస్టీ సెల్ ఉపాధ్యక్షులు విజయ్ నాయక్ తదితరులు ఉన్నారు.

## గుండెపోటుతో సాయి చంద్రకుమార్ మృతి -కుటుంబంలో విషాదం

**చింతూరు పెన్ పవర్ ఫిబ్రవరి 4:**చింతూరు పట్టణానికి చెందిన రైతు, మ్యాజిక్ డ్రైవర్ కోట్ల సాయి చంద్రకుమార్ (40) గుండెపోటుతో మృతి చెందడంతో కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. ఆయన అకాల మరణంతో భార్య అంజలి, ఇద్దరు పిల్లలు కన్నీటి పర్యంతమయ్యారు. భర్తను, తండ్రిని కోల్పోయిన బాధను వారు తట్టుకోలేక దుఃఖాన్ని వ్యక్తం చేశారు. సాయి చంద్రకుమార్ మంచి మనసు, సహాయ స్వభావం కల వ్యక్తిగా అందరికీ పరిచయమని గ్రామస్తులు గుర్తు చేసుకున్నారు. ప్రజలు, తోటి మ్యాజిక్ డ్రైవర్లు, స్నేహితులు ఆయన మంచితనాన్ని వర్ణిస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ ఘటన చింతూరులో విషాద వాతావరణాన్ని నెలకొల్పింది.



## విద్యార్థులకు ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ..

### ఎమ్మెల్యే సతీమణి బత్తుల వెంకటలక్ష్మి..




**కోరుకొండ, పెన్ పవర్, ఫిబ్రవరి 4:** రాజానగరం ప్రైమరీ హెల్త్ సెంటర్ నందు జాతీయ అంధత్వ నివారణ సంస్థ మరియు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్య ఆరోగ్య మరియు కుటుంబసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పాఠశాల విద్యార్థులకు ఉచిత కంటి అద్దాల పంపిణీ కార్యక్రమంలో జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కమిటీ కో-ఆర్డినేటర్ ఎమ్మెల్యే సతీమణి బత్తుల వెంకటలక్ష్మి విద్యార్థులకు అందజేశారు.ఈ సందర్భంగా వెంకటలక్ష్మి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్య ఆరోగ్య మరియు కుటుంబసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రాజానగరం నియోజకవర్గం వ్యాప్తంగా మొత్తం 8122 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించగా అందులో 724 మంది విద్యార్థులకు కంటి అద్దాలను అందజేయడం జరిగిందన్నారు.

ఈ కార్యక్రమంలో జనసేన, తెలుగుదేశం, బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా కోరుకొండ గంటాలమ్మ అమ్మవారి అన్నసమారాధన..

- అన్నసమారాధన కార్యక్రమానికి కంబాల లక్ష 25 వేలు విరాళం



**కోరుకొండ, పెన్ పవర్, ఫిబ్రవరి 04 :** కోరుకొండ గ్రామంలో బుధవారం నిర్వహించిన మాతృశ్రీ గంటాలమ్మ అమ్మవారి అన్నసమారాధన కార్యక్రమంలో విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ నాయకులు కంబాల శ్రీనివాసరావు ఆదేశాల మేరకు రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. ఆలయం వద్ద నిర్వహిస్తున్న అన్నసమారాధన కార్యక్రమానికి కమిటీ సభ్యులు కంబాల శ్రీనివాసరావుని ఆహ్వానించారు. ఆయన అందుబాటులో లేకపోవడంతో రామసేన సభ్యులు ఈ కార్యక్రమానికి హాజరైయారు. తొలిత వారు ఆలయంలో అమ్మవారి దర్శించుకుని, పూజలు నిర్వహించారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించి, భక్తులకు వడ్డించారు.ఈ అన్నసమారాధన కార్యక్రమానికి కంబాల శ్రీనివాసరావు గత ఏడాది లక్ష 25 వేలు రూపాయలు విరాళం అందించారు. అదే విధంగా ఈ ఏడాది కూడా లక్ష 25 వేలు రూపాయలు విరాళం అందించారు. ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు బత్తుల నానాజీ, దాసరి ధర్మరాజు, కంబాల యువసేన అధ్యక్షులు, ఉంగరాల మణిరత్నం, నాగ రమేష్, పసల గణేష్, దేశాల నరేష్, తుమ్మల బుజ్జి, నెల్లి శ్రీను, ధార శ్రీను ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు..

## ఉపాధి హామీ పథకానికి గాంధీజీ పేరు తొలగించడం అమానుషం. బోడా వెంకట్.



**గోపాలపురం, పెన్ పవర్, ఫిబ్రవరి 4.** పేద మధ్యతరగతి ప్రజానీకానికి బాసటగా నిలిచేఉపాధి హామీ పథకానికి గాంధీజీ పేరును తొలగించడం అత్యంత బాధాకరమని తూర్పుగోదావరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బోడా వెంకట్ ఆవేదన వ్యక్తం చేశారు. దేవరపల్లి మండలంలోని చెన్నై గూడెం గ్రామంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకుల సమావేశం బుధవారం నిర్వహించారు. పిసిసి కార్యవర్గ సభ్యులు జేష్ఠ సతీష్ బాబు అధ్యక్షతన రాష్ట్ర కాంగ్రెస్ అసంఘటిత కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు విల్లూరి రమేష్ గృహం వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా అధ్యక్షులు వెంకట్ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రానికి ఇంత అన్యాయం జరుగుతున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నోరు మెదపకపోవడం బాధాకరం అన్నారు. రాష్ట్రంలోని టిడిపి ,జనసేన పార్టీలు బిజెపికి మద్దతు ఇవ్వడం వల్ల రాష్ట్రానికి ఏమి చేకూరిందనిప్రశ్నించారు. ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని గత 20 ఏళ్ల కిందట యూపీఏ ప్రభుత్వం మహాత్మా గాంధీ పేరిట ఉపాధి హామీ పథకాన్ని ప్రారంభించింది అన్నారు. ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం ఆ పేరును తొలగించి వికసిత్ భారత్ అని నినాదాలు చేయడం బాధాకరం అన్నారు. టిడిపి, జనసేన, వైసీపీ ప్రభుత్వాలు ఖండించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కేంద్రప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకొని గాంధీజీ పేరును కొనసాగించాలని లేనిపక్షంలో కాంగ్రెస్ పార్టీ తరపున ఉద్యమం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పాక చిన్నబ్బాయి, మాజీ కార్యదర్శి బి వి ఆర్ చౌదరి, కొవ్వూరి శ్రీనివాస్, కాటం రవి, పిట్టా రామారావు, గన్నిన రామారావు, కాటం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రీ సర్వే పూర్తయిన ప్రతి రైతుకు రాజముద్రతో పాస్ బుక్



- జిల్లా జాయింట్ కలెక్టర్ స్మరణ రాజ్
- రంపచోడవరం ఎమ్మెల్యే శిరీష దేవి

**గంగవరం/ రంపచోడవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 4** :పోలవరం జిల్లాలో రీ సర్వే అయిన ప్రతి రైతుకు రాజముద్రతో గల కొత్త పాసుబుక్కులు అందజేయడం జరుగుతుందని రంపచోడవరం శాసనసభ్యులు, లెజిస్టేటివ్ చైర్మన్ మిరియాల శిరీష దేవి జిల్లా జాయింట్ కలెక్టర్ రాజ్ ఙర్కొన్నారు. బుధవారం రంపచోడవరం మండలం ఈతపల్లి గ్రామంలోని రీ సర్వే చేసిన గిరిజన రైతులకు కొత్త పాసు బుక్కులు పంపిణీ కార్యక్రమానికి రంపచోడవరం శాసనసభ్యులు, లెజిస్టేటివ్ చైర్మన్ మిరియాల శిరీష దేవి, రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి స్మరణ్ రాజ్ ముఖ్య అతిథులుగా హాజరైనారు. ఈ సందర్భంగా రంపచోడవరం శాసనసభ్యులు, లెజిస్టేటివ్ చైర్మన్ మిరియాల శిరీష దేవి మాట్లాడుతూ పోలవరం జిల్లాలోని గిరిజన రైతులకు సంబంధించిన కొత్త పాసుబుక్కులు రీ సర్వే అయిన గ్రామాల రైతులకు ఎప్పటికప్పుడు కొత్త పాసుబుక్కులు పంపిణీ చేయడం జరుగుతుందని ఆమె అన్నారు. రీ సర్వే అయిన భూముల రైతులు పాసుబుక్కులు కొద్దిగా జాప్యం అయినా తొందరపడవద్దని రైతులను ఎమ్మెల్యే కోరారు. ఈత పల్లి గ్రామంలో 15 మంది గిరిజన రైతులకు రీ సర్వే అయిన 15 మందికి కొత్త పట్టాలు పంపిణీ చేయడం జరిగిందని ఆమె అన్నారు. కొత్త పట్టాలు పంపిణీ తీసుకుంటున్న లబ్ధిదారులకు తప్పనిసరిగా ఫోటో తీసి పట్టాల పంపిణీ చేయడం జరుగుతుందని ఆమె అన్నారు. రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీ సర్వే వేగవంతంగా పూర్తి చేసి రైతులకు కొత్త పట్టాలు ప్రభుత్వ నిబంధన ప్రకారం సంబంధిత రైతులకు అందజేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ప్రభుత్వ నిబంధన ప్రకారం రీ సర్వే అయిన భూములకు ఒకటికి రెండుసార్లు పరిశీలించి కొత్త పట్టాలు రైతులకు అందజేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. అమరావతి నుండి ఐవిఆర్ కాల్స్ కొత్త పట్టాలు అందినది లేనిది అదేవిధంగా ఏమైనా ఇబ్బంది పడుతున్నది లేనిది అదేవిధంగా రైతులు సంతృప్తి పొందుతున్నది లేనిది అడిగి తెలుసుకుంటారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ పీ.బాలాజీ, ఆర్ ఐ సి హెచ్ నిర్మల కుమారి, వీఆర్వో అప్పారావు, సర్పంచ్ పంద సరస్వతి,ఎంపీటీసీ యన్. పాపారావు,సర్వేయర్ తురక దేవరత్నం తదితరులు పాల్గొన్నారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# సర్వేలను పారదర్శకంగా వేగవంతంగా పూర్తి చేయాలి







**డిప్యూటీ ఎంపీడీవో గోపన్న దొర**

**గంగవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 4:**ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత సమర్థవంతంగా అందించేందుకు కుటుంబ సర్వేలు, పౌరుల గుర్తింపు నమోదు, గృహ యూనిట్ల సర్వేలను వేగవంతం చేయాలని డిప్యూటీ ఎంపీడీవో గోపన్న దొర సిబ్బందిని ఆదేశించారు.బుధవారం గంగవరం మండల పరిధిలోని నెల్లిపూడి, పిడిత మామిడి ,మొల్లేరు గ్రామ సచివాలయాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సచివాలయాల్లో అమలవుతున్న వివిధ ప్రభుత్వ కార్యక్రమాల పురోగతిని ఆయన సమీక్షించారు.ప్రతి కుటుంబానికి సంబంధించిన వివరాలు ఖచ్చితంగా నమోదు చేయాలని, ఎలాంటి తప్పిదాలకు అవకాశం లేకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు.ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా సచివాలయ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే సమస్యలను సకాలంలో పరిష్కరించి, సేవలందింపులో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం గ్రామాల్లో జరుగుతున్న వివిధ సర్వేలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు .ఆయన వెంట మొల్లేరు సర్పంచ్ కె. లక్ష్మి ,సచివాలయం సిబ్బంది ఉన్నారు.

# జనారోగ్యానికి తిలోధకాలు






**✷ నిర్వహణలేక అధ్వాన్నంగా నీళ్ల ట్యాంకులు**

**ఏలూరు పిబ్రవరి 4 పెన్‌పవర్ :**సురక్షిత తాగునీటిని అందించే మంచినీటి ట్యాంకుల నిర్వహణ గ్రామ పంచాయితీలు గాలికొదిలేస్తూన్నాయి.కొన్ని చోట్ల ట్యాంకుల బాగోగులు పట్టించుకోవడం లేదు.ట్యాంకుల నిర్వహణ సరిగా సరిగా సరిగా లేక పాచిపడుతున్నాయి.లీకేజీలు,పిచ్చి మొక్కలు,మురుగు నీటి పరిసరాలు దారుణంగా దర్శనమిస్తున్నాయి.

నిర్వహణ గాలికొదిలారు.

దెందులూరు మండలం మేదినరావుపాలెం పంచాయితీలో ట్యాంకుల నిర్వహణ గాలికొదిలేశారు.ప్రజా రోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని క్రమం తప్పకుండా ప్రతి 15 రోజులకు ఒక సారి ట్యాంకులను శుభ్రం చేయించి క్లోరినేషన్ చేయించాల్సి ఉంటుంది.ముఖ్యంగా వర్షాకాలంలో తాగునీరు కలుషితం కాకుండా, అతిసారం, డెంగి, టైఫాయిడ్, మలేరియా తదితర విషజ్వరాల బారిన పడకుండా పంచాయితీలు జాగ్రత్తలు తీసుకోవాలి.మేదినరావు పాలెం పంచాయితీ పరిధిలోనిమేదినరావు పాలెం కొప్పులవారి గూడెం,ధర్మారావుపేట ఓహెచ్ఆర్ ట్యాంకుల నిర్వహణ సరిగా ఉండటం లేదు.కుళాయిల నుండి నాచు,క్రిమికీటకాలు వస్తున్నాయంటే పరిస్థితి అర్ధం చేసుకోవచ్చు.

అధ్వాన్నంగా ట్యాంకులు

మేదినరావు పాలెం కొప్పులవారి గూడెం, ధర్మారావు పేట ట్యాంకులను 3 నెలలుగా శు భ్రపరచిన దాఖలాలు లేవు.ట్యాంకుల పరిసరాలు అపరిశుభ్రతను తలపిస్తున్నాయి.కొప్పులవారి గూడెం పంపుసెట్ ఫ్యూజ్ బాక్స్‌కు తలుపులు తెరచి ప్రదాదకరంగా ఉంది.చిన్నపిల్లలు,మూగజీవాలు ముట్టుకుంటే ప్రమాదాలు జరిగే పరిస్దితి నెలకొని ఉంది.పైపులు పగిలి నీరు లీకవుతొంది.ట్యాంకుల నిర్వహణపై అధికారులు దృష్టి సారించాలని,తాగునీరు కలుషితం కాకుండా చూడాలని,సురక్షిత తాగునీరు సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాల్సిందిగా మూడు ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

## ప్రభుత్వ రాజముద్రతో రైతులకు పాస్ పుస్తకాల పంపిణీ




**సీతానగరం, పెన్ పవర్, ఫిబ్రవరి 4:** ప్రభుత్వ ఆదేశాల మేరకు సీతానగరం మండలంలోని బుధవారం మండల తాసిల్దార్ ఆధ్వర్యంలో సింగవరం గ్రామ పంచాయతీ పరిధిలోని సూమారు 669 పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు నేతలు లబ్ధిదారులకు అందజేసి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రైతుల యాజమాన్య హక్కులకు సంబంధించిన పట్టాదారు పాసు పుస్తకాలపై రైతుల నుండి విమర్శలు వచ్చాయన్నారు. దీనిపై స్పందించిన ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రాజముద్ర తో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు అందజేస్తామని తెలిపినట్లు ఈ మేరకు ఆచరణలోకి తీసుకొని వచ్చి రైతులకు అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రతి పట్టాదారు పాసు పుస్తకం మీద క్యూఆర్ కోడ్ ఉందని ఆ క్యూఆర్ కోడ్ ను స్కాన్ చేస్తే మీ భూమి లకేషన్ ఎక్కడ ఉందో తెలుస్తుందన్నారు. టెక్నాలజీని ఉపయోగించి డిజిటలైజేషన్ చేసి భూ యజమానుల హక్కులు పరిరక్షంచడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సంగన చిన పోసియ్య, కూటమి నేతలు గద్దే శ్రీనువాస్, అప్పన దుర్గ ప్రసాద్, తమ్మిశెట్టి ప్రశన్న కూమార్, వీఆర్వోలు వీఆర్ఏలు పంచాయతీ కార్యదర్శి సచివాలయ సిబ్బంది రైతులు తదితరులు పాల్గొన్నారు.




**పెన్ పవర్ ఉంగుటూరు, ఫిబ్రవరి 04**

ఆనంద నిలయం వృద్ధాశ్రమానికి స్థలం విరాళంగా ఇచ్చిన కొండ్రెడ్డి లీలావతి సంస్మరణ సభ

ఉంగుటూరు ఆనంద నిలయం వృద్ధాశ్రమానికి ఒక ఎకరం స్థలాన్ని విరాళంగా అందించిన కొండ్రెడ్డి లీలావతి ఇటీవల మరణించడంతో, ఆమె సేవలను స్మరిస్తూ బుధవారం ఉంగుటూరు మానవత కమిటీ ఆధ్వర్యంలో సంస్మరణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమం తాడేపల్లిగూడెంలోని వారి నివాసంలో జరిగింది.

ఈ సభకు ఉంగుటూరు మండల మానవతా అధ్యక్షులు కోనే వీర వెంకట సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొండ్రెడ్డి లీలావతి వృద్ధాశ్రమానికి విరాళంగా ఇచ్చిన భూమి వృద్ధులు, అనాధలకు ఎంతో ఉపయోగపడుతోందని తెలిపారు. సేవాభావంతో ఆమె చేసిన అనేక కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలిచాయని కొనియాడారు.

ఈ కార్యక్రమంలో మానవతా రాష్ట్ర విస్తరణ కమిటీ చైర్మన్ సాగిరాజు జానకిరామరాజు, రీజియన్ చైర్మన్ పుప్పాల గోపి, మండల కన్వీనర్ అడప శ్రీను, మాజీ మండల అధ్యక్షులు పుసులూరి సూరి ప్రకాష్, గురువెల్లి రాజారావు, పాతూరు వంశి, కొండ్రెడ్డి సర్వేశ్వరరావు తదితర మానవతా కార్యకర్తలు పాల్గొని ఆమెకు ఘన నివాళులు అర్పించారు.

# పులిని పట్టుకోలేకపోవడం ప్రభుత్వ అసమర్ధత : జక్కంపూడి రాజా విమర్శ



**రాజమహేంద్రవరం, పెన్ పవర్ ఫిబ్రవరి 4:** తూర్పుగోదావరి జిల్లాలో గత ఐదు రోజులుగా పులి సంచరిస్తున్నా, పట్టుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా విమర్శించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, జనవాసాల్లోకి పులి వచ్చి ప్రజలు భయాందోళనలకు గురవుతున్నా యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని మండిపడ్డారు. గతంలో అధికారులు సమర్ధవంతంగా పనిచేసి పులిని అటవీ ప్రాంతంలోకి పంపించారని, ప్రస్తుతం ఆ పరిస్థితి లేదని ఎద్దేవా చేశారు.

## బాల్యవివాహాలు భవిష్యత్తును నాశనం చేస్తాయి

ఎంపీడీవో లక్ష్మణరావు




**గంగవరం, పెన్ పవర్ ,ఫిబ్రవరి 4:**బాల్య వివాహాలు పిల్లల భవిష్యత్తును నాశనం చేస్తాయని, చట్టపరంగా బాల్య వివాహం నేరమని ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో లక్ష్మణరావు సూచించారు.బాల్య వివాహ ముక్తా భారత్ కార్యక్రమంలో భాగంగా బుధవారం కుసుమ రాయి గ్రామంలో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సీడీపీఓ సుచరిత ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించగా, ఎంపీడీఓ వై. లక్ష్మణ్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎంపీడీఓ లక్ష్మణ్ రావు మాట్లాడుతూ బాల్య వివాహాలు పిల్లల భవిష్యత్తును నాశనం చేస్తాయని, చట్టపరంగా బాల్య వివాహం నేరమని ప్రజలు అవగాహన కలిగి ఉండాలని సూచించారు.బాలికల విద్య, ఆరోగ్యం, భద్రతపై ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాల్సిన అవసరం ఉందన్నారు.సీడీపీఓ సుచరిత ఆదిలక్ష్మి మాట్లాడుతూ బాల్య వివాహాల నివారణకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. గ్రామ స్థాయిలో అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు, పంచాయతీ ప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తే బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించవచ్చని అన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ పి. రాజులమ్మ, ఉపాధి హామీ పథకం ఏపీఓ ప్రకాష్, జయలక్ష్మి, ఎస్. రాజకుమార్, ఎస్. రామారావు, సిరిలక్ష్మి, ఆశ కార్యకర్త మంగయమ్మతో పాటు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శాటిలైట్ సిటీ, అక్కమ్మ తల్లి గుడి పరిసరాల్లో పులి సంచారం

- ✷ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- ✷ అటవీ శాఖ ప్రత్యేక నిఘా ఏర్పాటు
- ✷ జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి





**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 4:** తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి రూరల్ శాటిలైట్ సిటీ, అక్కమ్మ తల్లి గుడి పరిసరాల్లో బుధవారం పెద్దపులి సంచరించడం తీవ్ర కలకలం రేపింది. గత 6 రోజులుగా గోదావరి పరీవాహక ప్రాంతం నుంచి దారితప్పి జనావాసాల్లో తిరుగుతుండటంతో స్థానికులు బిక్కుబిక్కుమంటున్నారు. సమాచారం అందుకున్న అటవీ, పోలీస్, రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఒంటరిగా బయటకు రావద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.పులి సంచరించే ప్రాంతాల్లో అటవీ శాఖ డ్రోన్ టెక్నాలజీతో నిరంతర పర్యవేక్షణ చేస్తుందని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. పూణే నుంచి ప్రత్యేక జీవరక్షణ, మత్తు ఇంజెక్షన్ నిపుణుల బృందం జిల్లాకు వస్తుందన్నారు. పులిని సురక్షితంగా పట్టుకునేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామన్నారు.

పులి సంచరించే ప్రాంతాల చుట్టూ 5 కిలోమీటర్ల పరిధిలోని అన్ని పాఠశాలలకు బుధవారం సెలవు

ప్రకటించారు. సెలవుల అమలుపై విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసారు. పులి ఫోటోలు, వీడియోలు వ్యక్తిగత సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేయవద్దన్నారు.

పులి సంచారం పై సమాచారం ఉంటే సమీప పోలీస్, రెవెన్యూ, అటవీ అధికారులకు తెలియజేయాలన్నారు.

పులిపై ఎటువంటి దాడులకు పాల్పడవద్దన్నారు. ఈనెల 1న జంతువులపై పులి దాడి ఘటన తరువాత ఎలాంటి దాడులు పునరావృతం కాలేదని అధికారులు స్పష్టంచేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ కీర్తి చేకూరి విజ్ఞప్తి చేసారు. రూమర్లు ప్రచారం చేసి అనవసర భయాందోళనకు గురిచేయవద్దని హెచ్చరించ్చారు.

2న తొర్రేడు మండలం వెంకటనగర్ పరిసరాల్లో ను, 3న గాదాల, దివాన్చెరువు ఎస్వీపీసీ ఫంక్షన్ హాల్ సమీపంలో ,గ్రామ శివారులో పులి కదలికలు ఉన్నాయన్నారు.పులిని పట్టుకునేందుకు చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్ అటవీ అధికారులుఅనుమతి తీసుకొన్నరన్నారు.

# అక్కమ్మ తల్లి గుడి సమీపంలో మాజీ ఎంపీ మార్గాని భరత్ పర్యటన.




**రాజులహేంద్రవరం, పెన్ పవర్ ఫిబ్రవరి 4 :**తూర్పు గోదావరి జిల్లా, రాజమండ్రి పరిసర , జనావాసాల ప్రాంతాల్లో పులి సంచారం రీత్యా తగు జాగ్రత్తలు తీసుకోవాలని మాజీ ఎంపీ మార్గాని భరత్ కోరారు. ముఖ్యంగా పిల్లలను బయటకు రాకుండా పెద్దలు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

పులి సంచరిస్తున్న అక్కమ్మ తల్లి గుడి సమీపంలో మాజీ ఎంపీ మార్గాని భరత్ బుధవారం పర్యటించారు. త్వరలో దానిని బంధించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ యంత్రాంగానికి విజ్ఞప్తి చేసారు. ఇప్పటికే పులి సుమారు వారం రోజులుగా జిల్లాలో సంచరిస్తూ రాజమండ్రి సిటీ కి అతి సమీపంలో సంచరిస్తున్నదన్నారు. దివాన్ చెరువు వద్ద, అక్కమ్మ తల్లి కొండ వద్ద చేరుకున్నదని, కొండ దాటితే శాటిలైట్ సిటీ ఎక్కువ జనాలు నివసించే ప్రదేశమని వై ఎంపీ మార్గాని భరత్ రామ్ఆందోళన వ్యక్తం చేసారు. అక్కమ్మ తల్లి కొండ ప్రాంతానికి విచ్చేసిన భరత్ రామ్ అక్కడ విధులు నిర్వర్తిస్తున్న అటవీ , పోలీస్ శాఖ వారిని పులి వివరాలు అడిగి తెలుసుకున్నారు.పులి ని త్వరగా బంధించే విధంగా ఏర్పాటు చేసుకోవాలని చెప్పగా, అత్యాధునిక పరికరాలు అధికారులు లేవని తెలుపగా సాక్షాత్తు పవన్ కళ్యాణ్ అటవీ శాఖ కూడా మంత్రి అని, ఆ పరికరాలు శాఖ సిబ్బందికి అందుబాటులో లేకపోవడం విచారకరమన్నారు.

# గంగవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మౌలిక సదుపాయాల కొరత

- కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యం
- ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆరోపణ




**గంగవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 4 :**పోలవరం జిల్లా గంగవరం మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు పూర్తిగా లేకపోవడం తీవ్ర ఆందోళనకరమని ఆదివాసీ సంక్షేమ పరిషత్ (274/16) గంగవరం మండల ప్రధాన కార్యదర్శి కలుముల ప్రసాద్ దొర ఆరోపించారు.ఈ విషయమై రంపచోడవరంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో అధికారులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. ఆదివారం రోజున తమ బృందంతో కలిసి కళాశాలను సందర్శించామని, సందర్శనలో అనేక లోపాలు బయటపడ్డాయని చెప్పారు. కళాశాలలో విద్యార్థులకు హాస్టల్ వసతి లేకపోవడంతో క్లాస్ రూమ్‌లనే నివాస గదులుగా ఉపయోగిస్తున్నారని, విద్యార్థుల భద్రతకు అవసరమైన వార్డెన్ లేదా వాచ్మెన్ నియామకం కూడా లేకపోవడం బాధాకరమన్నారు.విజిట్ సమయంలో కళాశాల ప్రాంగణంలో ఒక్క విద్యార్థి కూడా లేకపోవడం గమనించామని, అందరూ క్యాంపస్ వెలుపలికి వెళ్లారని తెలిసిందన్నారు.ఈ పరిస్థితుల్లో విద్యార్థులకు ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది అని ప్రశ్నించారు.కళాశాల యాజమాన్య నిర్లక్ష్యం వల్లే ఈ దుస్థితి ఏర్పడిందని ఆరోపించిన ప్రసాద్ దొర, చదువుకునే మరియు పడుకునే గదులకు సరైన విద్యుత్ సౌకర్యం కూడా లేదని తెలిపారు. చదువు గది, నివాస గది ఒకటే కావడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. బాత్‌రూమ్‌లలో సిగరెట్ ముక్కలు, వాడేసిన ఖైని ప్యాకెట్లు కనిపించాయని, ప్రహరీ వెనుక కూడా ఖైని ప్యాకెట్లు ఎక్కువగా ఉండటంతో విద్యార్థులు చెడు అలవాట్లకు లోనవుతున్నారన్న అనుమానం వ్యక్తం చేశారు.నాణ్యమైన విద్యతో పాటు మంచి సంస్కారం నేర్పాల్సిన కళాశాల యాజమాన్యం విద్యార్థులను గాలికి వదిలేసిందని విమర్శించారు. దీనివల్ల ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు తమ విధుల పట్ల ఎంత నిర్లక్ష్యం వహిస్తున్నారో స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు.తక్షణమే సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు శివ పాల్గొన్నారు.

# గంజాయి, డ్రగ్స్, సైబర్ నేరాలు, రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలి

**గంగవరం ఎస్ఐ వెంకటేష్**




**గంగవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 4:**గంజాయి, డ్రగ్స్, సైబర్ నేరాలు, రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని గంగవరం ఎస్ఐ వెంకటేష్ సూచించారు. మండలంలోని కొత్తాడలో బుధవారం గంగవరం ఎస్ఐ వెంకటేష్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గంజాయి, డ్రగ్స్, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణతో పాటు నకిలీ ఉద్యోగ మోసాలపై విస్తృతంగా వివరించారు.గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ప్రజలకు సూచించారు. ముఖ్యంగా విద్యార్థులు ఈ వ్యసనాల బారిన పడటం వల్ల వారి భవిష్యత్తు నాశనం అవుతోందని అన్నారు. ఎన్డిపిఎస్ చట్టం ప్రకారం గంజాయి పండించడం, రవాణా చేయడం, కలిగి ఉండడం వంటి చర్యలకు కఠిన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. గంజాయి రవాణా లేదా పెంపకం జరుగుతున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే 1972 టోల్ ఫ్రీ నెంబర్కు తెలియజేయాలని, అప్పుడు పోలీసులు తక్షణ చర్యలు తీసుకుంటారని తెలిపారు.అనంతరం సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తూ, నకిలీ లోన్ యాప్స్, ఓటీపీ వల, మోసపూరిత లింకులు, ఏఐ ఆధారిత సైబర్ మోసాల గురించి వివరించారు. మహిళలు అపరిచితులతో ఆన్‌లైన్ చాటింగ్ లేదా వీడియో కాల్స్ ద్వారా మోసపోకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.అనుమానాస్పద కాల్స్ లేదా లింకులు వచ్చినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అన్నారు. సైబర్ నేరాలకు సంబంధించి సమస్యలు ఎదురైతే 1930 టోల్ ఫ్రీ నెంబర్కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.రోడ్డు ప్రమాదాల నివారణపై మాట్లాడుతూ మద్యం సేవించి వాహనం నడపరాదని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. వాహనాలు నడిపేటప్పుడు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండడంతో పాటు ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని చెప్పారు.అలాగే నకిలీ ఉద్యోగ వాగ్దానాల మోసాలపై యువతీ యువకులు అప్రమత్తంగా ఉండాలని, ఉద్యోగాల పేరుతో ఎవరైనా మోసం చేసే ప్రయత్నం చేస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరికీ ఓటీపీలు తెలియజేయరాదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సారపు కామరాజు దొర, గంగవరం పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# తేనెటీగల పెంపక శిక్షణ ముగింపు సందర్భంగా సందర్భంగా రైతులకు సర్టిఫికెట్స్ అందజేత







**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. ఫిబ్రవరి 04.**కృష్ణి విజ్ఞాన కేంద్రం (కెవీకే), వెంకటరామన్నగూడెంలో నిర్వహించిన 7 రోజుల 2వ బ్యాచ్" తేనెటీగల పెంపకం పై నైపుణ్య శిక్షణ కార్యక్రమం ముగింపు సమావేశం నేడు విజయవంతంగా జరిగింది.

కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ ఇతీ. పి.విజయలక్ష్మి గారు 7 రోజులపాటు చోటుచేసుకున్న శిక్షణ కార్యకలాపాలను సమగ్రంగా వివరించారు. కార్య క్రమానికి ముఖ్య అతిథి గా డైరెక్టర్ ఆఫ్ ఎక్స్టన్షన్ డా . రీతూ విచ్చేశారు. రైతులు ఈ అవకాశాన్ని పూర్తిగా ఉపయోగించుకోవాలని కోరారు. రైతులు కేవలం పంట పొలాలకు మాత్రమే పరిమితం కాకుండా, తేనెటీగల పెంపకాన్ని ప్రత్యామ్నాయ ఆదాయ వనరుగా (ఆల్టర్నేట్‌గా) చేపట్టాలని సూచించారు. తేనె, మైనం వంటి తేనెటీగల ఉప ఉత్పత్తులకు (బై--ప్రొడక్ట్స్) మార్కెట్‌లో విస్తృతమైన డిమాండ్ ఉందని పేర్కొన్నారు. అందువల్ల రైతులు సంప్రదాయ రైతులుగా మాత్రమే కాకుండా, ఎంట్రప్రెన్యూర్స్‌గా మారాలనపిలుపునిచ్చారు.

ఒక ఇంట్రెప్రేనేర్ ఉండాలని గౌరవ ముఖ్య మంత్రి పేర్కొన్న నేపథ్యం లో పర్యావరణ సమతుల్యతను కాపాడుతూ ఆదాయం పెంచే తేనెటీగల పెంపకం అత్యంత అవసరం అని ఆమె పేర్కొన్నారు. శిక్షణల ద్వారా రైతులు నేర్చుకున్న శాస్త్రీయ అంశాలను తమ వ్యవసాయ కార్యకలాపాల్లో వినియోగించుకోవడంతో పాటు, వాటిని ఇతర రైతులకు కూడా పంచి అందించాలి అని సూచించారు. కార్యక్రమం లో శాస్త్రవేత్తలు, డా. ఏమాన్యూల్ , డా. ఆదర్శ, డా. ఉదయశ్రీ, డా.బి పెదబాబు, మరియు ఇతర రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు.

తేనెటీగల పెంపక శిక్షణ సందర్భంగా రైతులు తమ అనుభవాలు, సమస్యలు మరియు అభిప్రాయాలను వ్యక్తం చేశారు. కార్యక్రమం ముగింపు సందర్భంగా సర్టిఫికెట్స్ ను అందజేసి పాల్గొన్నవారిని అభినందించారు.

# పంట కాలువలను అభివృద్ధి చేస్తాం: ఎమ్మెల్యే బొలిశెట్టి.






**తాడేపల్లిగూడెం,పెన్ పవర్. ఫిబ్రవరి 04.** పెంటపాడు మండలంలో పంట కాలువలు,మురుగు బోదెలను ప్రత్యేక కార్యక్రమం ద్వారా అభివృద్ధి చేస్తామని శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. పెంటపాడు మండలం, కోరుమిల్లి గ్రామంలో బుధవారం మనకోసం మన ఎమ్మెల్యే కార్యక్రమంలో బసవతారకం ఉచిత క్యాన్సర్ చికిత్స శిబిరాన్ని సందర్శించారు. మీ భూమి మనభూమి కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ప్రజాసమస్యల పరిష్కార వేదిక లో పాల్గొన్నారు. పట్టాదారు పాసు బుక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పంట కాలువలు అభివృద్ధికి సహకరించాలని అన్నారు. ఆక్రమణలను తొలగించి సాగునీరు అందించేందుకు, మురుగునీరు ప్రవహించేందుకు పార్టీలకతీతంగా అందరూ సహకరించాలని కోరారు. కోరుమిల్లి గ్రామంలో 14 సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చారని,వాటిని ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని అన్నారు. గ్రామంలో సిసి డ్రైను మంజూరు చేసామని పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. మైక్రో ఫిల్టర్ మంజూరు చేస్తామన్నారు. పొంత రోడ్డు నిర్మిస్తామని తెలియజేశారు. గత ప్రభుత్వం రైతులను అనేక ఇబ్బందులకు గురి చేసిందని విమర్శించారు.సకాలంలో ఎరువులు లేక, పండిన పంటకు అమ్ముకునే అవకాశం లేక ఇబ్బందులు పడ్డారని ప్రస్తుతం ఆ ఇబ్బందులను తొలగించామని అన్నారు. గ్రామంలో కొందరు వైసిపి వ్యక్తులు గ్రామ పెద్దలకు, అభివృద్ధికి సహకరించకుండా అడ్డగోలుగా ప్రవర్తించటం తగదని అన్నారు.ఈ కార్యక్రమంలో కోరుమిల్లి సర్పంచ్ భాస్కరరావు, పెంటపాడు మండలం అధ్యక్షుడు పుల్ల బాబి, పెంటపాడు భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు ప్రసాద్, పెంటపాడు తెలుగుదేశం మండల అధ్యక్షులు, కిలపతి వెంకటరావు, బిజెపి ఇంచార్జ్ ఈతకోట తాతాజీ మండల ఎంపీపీ కట్టుబోయిన వెంకటలక్ష్మి, పెంటపాడు మండల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# తిమ్మాపురం పంచాయతీపారిశుధ్య పనులను పర్యవేక్షించిన ఎం.పి.డి.ఓ . కుమార్..






**అడ్డతీగల,పెన్ పవర్, ఫిబ్రవరి04:**అడ్డతీగల మండలం తిమ్మాపురం గ్రామపంచాయతీని బుధవారం అడ్డతీగల ఎంపీడీవో కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో కొనసాగుతున్న పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. గ్రామంలోని కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్ ( సి ఆర్ పి ) ద్వారా ప్రతి ఇంటిని సందర్శించి తడి చెత్త, పొడి చెత్తను వేరు వేరుగా సేకరించి, ప్రతిరోజూ ఇంటింటికి వచ్చే చెత్త సేకరణ ట్రైసైకిల్‌లో వేయాలని ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

తదనంతరం గ్రామంలోని చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. షెడ్డు వద్ద నేమ్ బోర్డు, ఫెన్సింగ్, విద్యుత్ మరియు తాగునీటి సదుపాయాలు లేవని గుర్తించారు. ఈ లోపాలను వెంటనే పరిష్కరించేందుకు తిమ్మాపురం గ్రామ పంచాయతీ 15వ ఆర్థిక సంఘం నిధులతో సంబంధిత పనులను చేపట్టి 15 రోజుల్లో పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. అలాగే గ్రామంలో ఉన్న వాటర్ ట్యాంక్‌కు ప్రతిరోజూ క్లోరినేషన్ చేయాలని, 15 రోజులకు ఒకసారి ట్యాంకును శుభ్రం చేయించాలని సూచించారు. ట్యాంకు శుభ్రం చేసిన తేదీని ట్యాంకుపై తప్పనిసరిగా నమోదు చేయాలని,పంచాయతీ కార్యదర్శికి ఆదేశాలు జారీ చేశారు .

# ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తూ, సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి





## రాష్ట్రంలో శాంతి భద్రతలు అదుపులో పెట్టాలి.

## వడ్డి రఘురామ్ నాయుడు.

**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. ఫిబ్రవరి 04.**నెయ్యి కల్తీ అంశంపై, సిట్ (రాజు) చార్జ్‌షీట్‌కు విరుద్ధంగా, వైఎస్ జగన్మోహన్ రెడ్డి, వై.వి. సుబ్బా రెడ్డి, భూమన కరుణాకర్ రెడ్డి ఫోటోలతో తప్పుడు, అపవాదులు కలిగిన పోస్టర్లు ఏర్పాటు చేసి ప్రజల్లో శాంతిభద్రతలకు భంగం కలిగే విధంగా వాటిని సామాజిక మాధ్యమాలలో ప్రచారం చేస్తున్న తెలుగుదేశం పార్టీ నాయకులు మరియు కార్యకర్తలను గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇంచార్జి వడ్డి రఘురామ్ నాయుడు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు తాడేపల్లిగూడెం పట్టణ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు.

తొలుత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి పట్టణ పోలీస్ స్టేషన్ వరకు బైక్ ర్యాలీగా బయల్దేరి వెళ్లారు. అనంతరం పట్టణ ఇంచార్జి సీఐ బి.బి.రవికుమార్ కు ఫిర్యాదు అందచేశారు. ఈ సందర్భంగా వడ్డి రఘురామ్ నాయుడు మాట్లాడుతూ ప్రస్తుతం ఆంధ్రరాష్ట్రంలో శాంతిభద్రతలు కరువయ్యాయన్నారు. తిరుపతి లడ్డులో కల్తీ ఉందని ఎవరు నిర్ధారించకుండానే విషప్రచారం చేయడమెంటన్నారు. కూటమి నేతలు శాంతి భద్రతలకు విఘాతం కలిగేలా దాడులు చేయడం, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం దారుణమన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కలియుగ దైవం వెంకటేశ్వరస్వామి భక్తులు మనోభావాలు దెబ్బతినే విధంగా ప్రవర్తిస్తున్న తీరు అమానుషమన్నారు. ఆ భగవంతుడు అన్ని చూస్తున్నారని,.చేసిన ప్రతిదానికి ఆ దేవుడు చూస్తూ ఊరుకోరన్నారు. వెజిటబుల్ ఆయిల్ కలిస్తే దానిని పంది కొవ్వు అనడం ఎంత దారుణమన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ ఇచ్చిన రిపోర్టు కూడా నమ్మకుండా ఇంకా నీచరాజకీయులు చేయడం తగదన్నారు. ఇష్టమొచ్చినట్లు చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని దాడులు చేయడం ఏంటని, అసలు ప్రజాస్వామ్యం అనేదే ఉందా అని ప్రశ్నించారు. ఆనాడు చంద్రబాబు జగన్మోహన్ రెడ్డి ని ఎన్ని దారుణమైన మాటలు అన్నారు దానికి ఎప్పుడైనా వారిని క్షమించమని అడిగారా? అని ప్రశ్నించారు. తప్పు చేసిన వారు ఎవరైనా కూడా ఆ వెంకటేశ్వర స్వామి ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. తప్పుడు ప్రచారాలు చేస్తున్న వారిని వెంటనే గుర్తించి వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.






## ప్రపంచ క్యాన్సర్ దినోత్సవ అవగాహన కార్యక్రమం..



**అడ్డతీగల,పెన్ పవర్, ఫిబ్రవరి04 :** అడ్డతీగల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో డాక్టర్. పండా సతీష్ ఆధ్వర్యంలో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాన్సర్‌ను ఎదుర్కోవడంలో అవగాహన ప్రాముఖ్యత, తప్పుడు సమాచారం మరియు అపోహలు, ముందస్తు గుర్తింపుతో వ్యాధిని ఎలా నివారించవచ్చో హాస్పిటల్ కౌన్సిలర్ నారే. వాసు వివరించారు.డాక్టర్ హర్ష మాట్లాడుతూ క్యాన్సర్ గురించి ప్రతి ఒక్కరికి అవగాహన పెంచడం, వ్యాధిపై సరైన సమాచారాన్ని ప్రజలకు చేరవేయడం ద్వారా దీనిపై పోరాటాన్ని బలోపేతం చేయడానికి, ప్రభుత్వం ప్రత్యేక అవకాశాన్ని కల్పిస్తున్నదని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా మరణాలకు ప్రధాన కారణాల్లో క్యాన్సర్ ఒకటిగా ఉందని, భారత్‌లో ముఖ్యంగా మహిళల్లో తీవ్ర ఒత్తిడి ఎక్కువగా ఉండటం క్యాన్సర్ కేసులు పెరగడానికి ఒక కారణమని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నివారణ, చికిత్స, నియంత్రణకు అవసరమైన ప్రోత్సాహాన్ని అందిస్తున్నదని పేర్కొన్నారు.ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం 2000 ఫిబ్రవరి 4న ప్రారంభమైందని, యూనియన్ ఫర్ ఇంటర్నేషనల్ క్యాన్సర్ కంట్రోల్ ( యు ఐ సి సి ) ఆధ్వర్యంలో ప్రపంచవ్యాప్తంగా క్యాన్సర్‌పై అవగాహన పెంపొందించేందుకు ఈ దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు కౌన్సిలర్ వాసు తెలిపారు.డాక్టర్ ప్రసన్న మాట్లాడుతూ క్యాన్సర్‌పై అవగాహన పెంచడం, ప్రభుత్వాలు, సంస్థలు, వ్యక్తులు ఈ వ్యాధికి వ్యతిరేకంగా చర్యలు తీసుకునేలా ప్రేరేపించడమే ప్రపంచ క్యాన్సర్ దినోత్సవ లక్ష్యమని అన్నారు. ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 4న సెమినార్లు, వర్క్‌షాప్‌లు, అవగాహన ప్రచారాలు నిర్వహిస్తున్నట్లు డాక్టర్. హర్ష తెలిపారు.ప్రపంచ ఆరోగ్య సంస్థ ( డబ్ల్యు హెచ్ ఓ ) ప్రకారం క్యాన్సర్ ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది మరణాలకు కారణమవుతోందని, జీవనశైలి మార్పులు, కాలుష్యం, పొగాకు, మద్యపానం, అనారోగ్యకరమైన ఆహారం, శారీరక శ్రమ లేకపోవడం వంటి అంశాలు క్యాన్సర్‌కు దారితీస్తున్నాయని తెలిపారు. ప్రజలకు సరైన సమాచారం, వనరులు అందించడం ద్వారా ఈ వ్యాధిని నివారించడమే ప్రపంచ క్యాన్సర్ దినోత్సవ ప్రధాన ఉద్దేశమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

## రైతుక్షేమం కోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్నాం: ఎమ్మెల్యే బొలిశెట్టి.





**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. ఫిబ్రవరి 04.**రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. గూడెం మండలం వెంకట రామన్న గూడెంలో బుధవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. రైతులకు పాస్ బుక్కుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతుల ఇబ్బందులను తొలగించి అనేక సంక్షేమ చర్యలు చేపట్టిందన్నారు. కోకో, కొబ్బరి రైతులకు రాయితీలు ఇచ్చామని తెలిపారు. ట్రాక్టర్లు, డ్రోన్లు తదితర వ్యవసాయ పరికరాలను అందజేస్తున్నామన్నారు. తక్కువ ధరలకు ఎరువులు పురుగు మందులు సరఫరా చేస్తున్నామని తెలిపారు.అధికారం చేపట్టిన వెంటనే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ను అమలు చేసి రైతు లకు మేలుచేశామని అన్నారు. రాజముద్రతో పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేస్తున్నామన్నారు. రైతుల భూముల విషయంలో ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టామన్నారు. గత ప్రభుత్వ అరాచక పాలనలో రైతులను కష్టాలు పాలు చేశారని విమర్శించారు.రైతులు, కార్మికులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ఆలోచనలు చేస్తుందని తెలిపారు. కూటమి ప్రభుత్వ మంచి పరిపాలనను చూసి ఓర్వలేక వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తుందని ఈ విషయాన్ని ప్రజలు గ్రహించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ సునీల్ కుమార్, బిజెపి ఇన్చార్జి ఈత కోట తాతాజీ, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు అడప ప్రసాద్, పుల్లా బాబి,జనసేన పట్టణ అధ్యక్షుడు వర్తనపల్లి కాశి, పసుమర్తి రామ్ లక్ష్మణ్ మరిడి చిన్న
అరసాల నారాయుడు
గోతం పోసిబాబు
మణికల లక్ష్మణ రావు
మరిది శ్రీను టిడిపి నాయకులు పసుమర్తి రామ్ లక్ష్మణ్, చేపల రమేష్, వాడపల్లి సుబ్బరాజు, పైబోయిన వెంకటరామయ్య, పేతిన గిరి, అధికారులు,కూటమి నాయకులు పాల్గొన్నారు.

## భవననిర్మాణ కార్మికసంఘం నూతన కార్యవర్గశీ ఎన్నిక



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. ఫిబ్రవరి 04.**పశ్చిమగోదావరి జిల్లా, తాడేపల్లిగూడెం ఏరియా తాపీ, వడ్రంగి, సెంటరింగ్ రాడ్ బెండింగ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి అనుబంధం) సర్వసభ్య సమావేశం బుధవారం తాడేపల్లిగూడెం ,సిపాయిపేట లోని భవననిర్మాణ కార్మికసంఘం కార్యాలయంలో అధ్యక్షుడు దువ్వా శ్రీను అధ్యక్షతన జరిగింది.

గత రెండేళ్లుగా యూనియన్ యూనియన్ నిర్వహించిన కార్యకలాపాలపై కార్యదర్శి అత్తిలి బాబీ మాట్లాడారు. జమాఖర్చుల వివరాలను కోడె సాయిబాలాజీ తెలిపారు. జిల్లా యూనియన్ పూర్వాధ్యక్షుడు పాలూరి లక్ష్మణరావు, జిల్లా కార్యదర్శి పోలిరాతి ఆదినారాయణ, గౌరవాధ్యక్షులు బోడపాటి నాగేశ్వరరావు, జిల్లా నాయకులు మెండెం జేమ్స్ , ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి సోమసుందర్, ఏరియా అధ్యక్షులు ఓసూరి వీర్రాజు, కార్యదర్శి మందలపర్తి హరీష్ తదితరులు మాట్లాడారు. దాదాపు మూడువందల మంది కార్మికులు హాజరయ్యారు. అంకం భాస్కరరావు గౌరవాధ్యక్షునిగా,
పడాల శ్రీనివాస్ అధ్యక్షునిగా, పంతం రామకృష్ణ కార్యదర్శిగా, కోడె సాయిబాలాజీ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా, మాదు శ్రీనివాస్ కోశాధికారిగా మరో ముప్పై ఐదు మందితో నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికయ్యింది. సమావేశం కూలీ రేట్లను పెంచాలని నిర్ణయించింది. రేట్ల పెంపుదల మార్చి 2 వ తేదీ నుంచి అమలు లోకి వస్తుందని అధ్యక్షుడు పడాల శ్రీనివాస్ ప్రకటించారు.

## 49 మంది లబ్దిదారులకు 29 లక్షల 3వేల 526 రూపాయలు వ ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. ఫిబ్రవరి 04.**తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న 49 మంది లబ్దిదారులకు మంజూరైన 29లక్షల 3వేల 526 రూపాయలు విలువ గల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ బుధవారం క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యానికి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. అనారోగ్యం కారణంగా పేద, మధ్యతరగతి కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో సీఎం సహాయ నిధిని అందుబాటులో ఉంచి, అవసరమైన ప్రతి ఒక్కరికీ సహాయం అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో ఇప్పటివరకు 708 మంది లబ్దిదారులకు గాను మొత్తం 4కోట్ల 71లక్షల 42వేల 706 రూపాయలు విలువ గల సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేయడం జరిగిందన్నారు.

ప్రజల పట్ల ప్రభుత్వానికి ఉన్న బాధ్యతాభావానికి నిదర్శనమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్చార్జ్ ఈతకోట తాతాజీ, బోలిశెట్టి రాజేష్,
కూటమి నాయకులు జనసేన టిడిపి బిజెపి కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు...

## నారాయణపురం వైఎస్ఆర్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా పైడి అరుణ్‌కుమార్ రెండోసారి ఏకగ్రీవ ఎన్నిక



**పెన్ పవర్ -- ఉంగుటూరు, ఫిబ్రవరి 04** :ఉంగుటూరు మండలం నారాయణపురం గ్రామంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా పైడి అరుణ్‌కుమార్ రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఉంగుటూరు మండల వైఎస్ఆర్‌సీపీ అధ్యక్షుడు వెంకట మంగారావు మాట్లాడుతూ, పార్టీని గ్రామ స్థాయిలో మరింత బలోపేతం చేసే దిశగా ప్రతి గ్రామంలో నూతన కమిటీలను ఏర్పాటు చేసి, అనుబంధ విభాగాల కమిటీలను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

పార్టీ బలోపేతంలో భాగంగా నారాయణపురం గ్రామ కమిటీ అధ్యక్షుడిగా రెండోసారి ఎంపికైన పైడి అరుణ్‌కుమార్‌ను పార్టీ నాయకులు ఘనంగా అభినందించారు. గ్రామాల్లో పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కమిటీ సభ్యులు సమిష్టిగా కృషి చేయాలని మంగారావు కోరారు.

ఈ కార్యక్రమంలో ఉంగుటూరు మండల ఎంపీటీసీ చాంబర్ అధ్యక్షులు బండారు నాగరాజు, జిల్లా పంచాయతీరాజ్ విభాగం ప్రధాన కార్యదర్శి అడపా శ్రీనివాసరావు, మండల యూత్ ఉపాధ్యక్షుడు సీపాని బాలాజీ, నారాయణపురం ఎంపీటీసీ అరవెల్లి మహాలక్ష్మి దానయ్య, గ్రామ బీసీ సెల్ అధ్యక్షులు నేదురు గంగాధర్ రావు, గ్రామ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి బొబ్బిలి శ్రీనివాసరావు, మండల ఎస్సీ సెల్ కార్యదర్శి తాడిగడప వెంకటేశ్వరరావు, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి ఉండ్రాజవరపు నరేష్, గ్రామ బీసీ సెల్ కార్యదర్శి లావేటి వీరాచారి, లక్కపోగోపి, గంగోలు జగదీష్, లావేటి లింగాచారి, కిలపర్తి వీరబాబు, రామలింగేశ్వరరావు, పైడి వరప్రసాద్, బోడిగడ్డ ప్రసాద్, అక్కిన గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అలాగే నారాయణపురం గ్రామంలో వైఎస్ఆర్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులుగా బీసీ సెల్ అధ్యక్షుడిగా నేదురి గంగాధర్ రావు, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా ఉండ్రాజవరపు ముసలయ్య, యూత్ విభాగం అధ్యక్షుడిగా మజడ వంశి, విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా ఉండ్రాజవరపు హరీష్, రైతు విభాగం అధ్యక్షుడిగా మతుకుమల్లి శ్రీధర్, మహిళా విభాగం అధ్యక్షురాలిగా తాడిగడప ధనలక్ష్మిని నియమించారు.

ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన కమిటీ సభ్యులు పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తామని తెలిపారు.

## సైనిక్ వెల్ఫేర్ నిధికి మెప్మా సంఘాల రూ.5.85 లక్షల విరాళం

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 4:**తూర్పు గోదావరి జిల్లా సైనిక్ వెల్ఫేర్ నిధికి జిల్లాలోని 2 మునిసిపాలిటీలు, 1 నగర పాలక సంస్థ పరిధిలోని మెప్మా స్వయం సహాయక సంఘాల మహిళలు తమ వంతు సహకారంగా రూ.5,85,288 విరాళాన్ని కలెక్టర్ కీర్తి చేకూరి వారి సమక్షం లో సైనిక్ వెల్ఫేర్ అధికారులకు అందజేశారు.బుధవారం కలెక్టర్ ఛాంబర్‌లో మెప్మా పిడి టి. కనక రాజు, స్వయం సహాయక సంఘాల మహిళలు ఫ్లాగ్ డే కాంట్రిబ్యూషన్ చెక్‌ను గౌరవ కలెక్టర్‌కు అందజేశారు.మెప్మా పట్టణ ప్రాంతాల్లోని స్వయం సహాయక సంఘాల మహిళలు ప్రతి ఒక్కరూ రూ.10 చొప్పున స్వచ్ఛందంగా విరాళం అందించి దేశ రక్షణ కోసం విధులు నిర్వహిస్తున్న సైనికుల సంక్షేమానికి తమ మద్దతు తెలియజేయడం అభినందనీయమని కలెక్టర్ కీర్తి చేకూరి అన్నారు.

దేశ రక్షణ కోసం సేవలందిస్తున్న సైనికుల సంక్షేమం మనందరి మీద ఉన్న గురుతరమైన బాధ్యత అని ఆమె స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సైనిక్ వెల్ఫేర్ నిధికి సహకారం అందించిన మెప్మా పిడి టి. కనక రాజు, మెప్మా జిల్లా సమాఖ్య సభ్యులు, సిబ్బంది స్వయం సహాయక సంఘాల మహిళలను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమములో మెప్మా, ప్రాజెక్ట్ డైరెక్టర్ టి కనకరాజు, జిల్లా సమాఖ్య ప్రెసిడెంట్ యస్. బాల సరస్వతి సభ్యులు, జిల్లా సిబ్బంది పి. శ్రీదేవి, యమ్.ఇ ఫణి కుమార్, ఎస్ హెచ్ జీ మహిళలు,
ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## సెంట్రల్ జైల్లో అంబటి రాంబాబు కు స్లీప్ అమ్నేషియా మందులు అందజేత

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 4 :** సెంట్రల్ జైల్లో మూలఖత్ లో అంబటిని కలిసిన తిరుమల లడ్డు కల్తీ వ్యవహారంలో సిబిఐ సిట్ నివేదిక అనంతరం చంద్రబాబును అసభ్యంగా దూషించిన వ్యవహారంలో కోర్టు రిమాండ్ విధించగా మాజీ మంత్రి అంబటి రాంబాబు సెంట్రల్ జైల్లో ఉన్న సంగతి తెలిసిందే. ఆయనకు నిద్రలేమి, శ్వాస కోశ సంబంధ రుగ్మతల నివారణ కు ఆయన కు కుటుంబ సభ్యుల ద్వారా స్లీప్ అమ్నేషియా పరికరం,మందులు జైలు అధికారులు కోర్టు అనుమతి తో, వైద్యుల సూచనల మేరకు జైలు అధికారులు అందజేశారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

## కూటమి ప్రభుత్వంలో అరాచక పాలన

- ప్రవీణ్ పగడాల కేసులో కోర్టులో కౌంటర్ దాఖలు చేయని ప్రభుత్వం
- మాజీ ఎంపీ జీవి హర్ష కుమార్ విమర్శ

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 02 :**పాస్టర్ ప్రవీణ్ పగడాల హత్య జరిగి11 నెలలు అయినా మృతి పై పోలీసులు నిర్ధారణ చేయలేదని మాజీ ఎంపీ జీవీ హర్ష కుమార్ అన్నారు. బుధవారం రాజీవ్ గాంధీ డిగ్రీ కాలేజీలో విలేకరుల సమావేశం లో ఆయన మాట్లాడుతూ, పాస్టర్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాస్టర్ హైదరాబాదు నుంచి తాగుతూ వచ్చి రాజమండ్రిలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు వ్యాఖ్యలు చేయడాన్ని తప్పుపట్టారు. ప్రవీణ్ పగడాల మృతి పై నిజాలు కోరుతూఏప్రిల్ లో తాను ప్రజల సహకారంతో రూ 5 లక్షల ఖర్చు పెట్టి పబ్లిక్ ఇంట్రెస్ట్ పిటిషన్ వేశానని, ఈ కేసు పై కౌంటర్ దాఖలు చేయమని కోర్టు అక్టోబర్ లో తీర్పు ఇచ్చిందన్నారు. పరకామణి కేసులో అప్పుటి ఎస్పీ, ప్రస్తుత జిల్లా ఎస్పీ డి. రమేష్ కిషోర్ ఉన్నారని తెలిపారు. పాస్టర్ ప్రవీణ్ పగడాల హత్య ఎలాగైతే జరిగిందో, సిఐ హత్య కూడా జరిగిందని వివరించారు. రాష్ట్రంలో హత్యలు జరుగుతున్నప్పటికీ ప్రతిపక్ష నాయకులు ఖండించరన్నారు. ప్రభుత్వం ఇప్పుడు కల్తీ లడ్డు వ్యవహారం పదే పదే ప్రస్తావించడం తోపాటు, భూములను కార్పొరేట్ సంస్థలకు తక్కువ రేట్లకు, గీతం యూనివర్సిటీ కి 55 ఎకరాల భూమిని ధారాతత్వం చేశారని విమర్శించారు.హాస్పిటల్స్ ఆరోగ్యశ్రీ బిల్లులు చెల్లించడం లేదన్నారు. రాష్ట్రలో ఈ ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తున్నదన్నారు. విమర్శించారు. ప్రజలు ప్రభుత్వ విధానలాన్ని గమనిస్తున్నారని వారే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

## ఎస్ కే విటీ (ఇ. మీ) పాఠశాల విద్యార్థులకు కళ్ల జోళ్లు పంపిణీ



**రాజమహేంద్రవరం, పెన్ పవర్,, ఫిబ్రవరి 4**
ప్రభుత్వ వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఇటీవల స్థానిక ఎస్ కే విటీ ఇంగ్లీషు మీడియం పాఠశాలలోని విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించగా వారిలో అవసరమైన వారికి జాతీయ అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో కళ్ల జోళ్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ముఖ్య అతిధిగా హాజరై విద్యార్థులకు కళ్ల జోళ్లు పంపిణీ చేసి కళ్ల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, పాఠశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పలువురు నగర కాంగ్రెస్ పార్టీలో చేరిక




**రాజమమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 4 :** నగర కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారం అనేకమంది కాంగ్రెస్ పార్టీలో రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ జనరల్ సెక్రెటరీ సిండియారాని ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమానికి నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బాలేపల్లి మురళి అధ్యక్షత వహించగా మాజీ జిల్లా అధ్యక్షులు టీ కే విశ్వేశ్వర రెడ్డి ,జిల్లా మహిళా అధ్యక్షురాలు శారద ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఇంతమంది పార్టీలో చేరటం చాలా ఆనందంగా ఉందని పార్టీ బలోపేతానికి కష్టపడి పని చేయాలని కోరారు. ఈ సమావేశంలో రాజమండ్రి నగర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలుగా నియమింపబడిన నీలా చౌదరి జిల్లా మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు, ఈస్టర్ రాణి జిల్లా మహిళా కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ షేక్ లలిత గారిని ఘనంగా సన్మానించారు . ఈ సందర్భంగా ఉన్యాస వక్త జయరాజు ని జిల్లా స్పోకెస్ పర్సన్ గా నియమించడం జరిగినది. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ చైర్మన్ చాలా నటరాజ్ వగర ఎస్సీ సెల్ చైర్మన్ బత్తిన చందర రావు అనపర్తి నియోజకవర్గ కోఆర్డినేటర్ ఏసు తదితరులు పాల్గొన్నారు

## నూతన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ ప్రారంభం



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. ఫిబ్రవరి 04.** తాడేపల్లిగూడెం లో నూతన కార్యాలయం ప్రారంభోత్సవం సందర్భంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డీజీఎం ముంబై వారిచే ప్రారంభోత్సవం సందర్భంగా
ముఖ్య అతిధిగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, తాడేపల్లిగూడెం పట్టణ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్
గొర్రెల శ్రీధర్ పాల్గొని కస్టమర్లకు బ్యాంక్ లకు మధ్య మంచి సర్వీస్ చెయ్యాలి అని అన్నారు.
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ మేనేజర్ రమేష్ బాబు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ శివానంద్ చేతుల మీదుగా సత్కారం చేశారు.ఈ కార్యక్రమములో స్టేట్ బ్యాంక్ ఇండియా బ్రాంచ్ సిబ్బంది పాల్గొన్నారు

## జిల్లాలో సంస్థాగతంగా వైసీపీ ని బలోపేతం చేయడమే లక్ష్యం




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 4 :**వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ సంస్థాగత కమిటీల నిర్మాణం కోసం వెంకటనగరం తొర్రేడు , కాతేరు గ్రామాల నాయకులతో బుధవారం రాజమండ్రి రూరల్ మండల పార్టీ అధ్యక్షులు ఉప్పులూరి సత్యనారాయణ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా జిల్లా పార్టీ అధ్యక్షులు చెల్లుబోయిన వేణు,పార్లమెంట్ ఇంచార్జ్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్,రాష్ట్ర అధికార ప్రతినిధి యనమల నాగార్జున యాదవ్ లు హాజరయారు.
చెల్లుబోయిన వేణు మాట్లాడుతూ పార్టీని క్రింది స్థాయి నుంచి బలోపేతం చేయడానికి నాయకులు వై.యస్ జగన్మోహన్ రెడ్డి క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేపట్టే విధంగా కార్యచరణ రూపకల్పన చర్యలు తీసుకున్నారని దానికి అనుగుణంగా పార్టీని ప్రజలకు చేరువు గా తీసుకువెళ్లాలన్నారు . ప్రతి గ్రామంలో మండలంలో ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరిని కమిటీల్లో ప్రాతినిధ్యం వహించే విధంగా భాగస్వామ్యం చేయాలన్నారు. అన్ని వర్గాల నుంచి పార్టీ పదవుల్లో అవకాశం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు నక్క రాజబాబు,గోందేశీ శ్రీనివాసరెడ్డి, గిరిజాల బాబు, నక్క నగేష్, చెల్లుబోయిన నరేన్,అంగాడ సత్యప్రియ,యెజ్జు శ్రీనివాస్ కిరణ్, పెయ్యాల రాజేష్,తొర్రేడు గ్రామ అధ్యక్షులు చిట్టూరి శ్రీనివాస్, ఉప్పులూరి రాము,చోల్లంగి సత్యగిరి,ఆచంట మారుతి దేవి,చిట్టూరి వెంకట్రావు,దండమూడి అర్జునరావు,ఎరుబండి వెంకట్రావు,సోదదాసి రాహుల్ కుమార్, మెప్పెల్లి రాజు,మోత రమేష్,ఎరుబండి సాయి,కోల్లి వెంకటరత్నం,పెనుమాక సునీల్, నక్కా దానరాజ్,రొంగల వెంకటేష్, మద్దా దుర్గారావు,లాయర్ శ్రీను,కొత్తపల్లి నాగేశ్వరావు,పాస్టర్ విజయ సారధి, పట్టా ఉత్తేజ్,ఉండ్రజవరపు సూర్య, దేవమాత,దిలీప్,చీకట్ల రంజిత్,వీణం దేవి,ఎండీ మున్నిసా తదితరులు పాల్గోన్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## ఉపాధ్యాయులు, వార్డెన్లు తీరు మారకపోతే చర్యలు తప్పవు







**ఎస్ టి కమిషన్ చైర్మన్ బొజ్జి రెడ్డి ఆరోపణ**

**వై రామవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 4:** కొందరు ఉపాధ్యాయులు, డిప్యూటీ వార్డెన్లు విధులు నిర్వర్తించే సమయంలో మద్యం సేవించి ఉంటున్నారని, వీరు విద్యార్థులకు ఏ విధంగా విద్యాబోధన చేస్తారని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ సోల్ల బొజ్జిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

ఇటువంటి వారు పద్ధతులు మార్చుకోకపోతే చర్యలు తప్పవని సంపూర్ణత అభియాన్ 2.0 ప్రోగ్రాం కి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్టీ కమిషన్ చైర్మన్ హెచ్చరించారు. పోలవరం జిల్లాలోని గ్రామాలను అభివృద్ధి పదంలో నడిపే విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ రకాల పథకాలు మంజూరు చేశాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎస్ బొజ్జి రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక వైరామవరం పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న గ్రౌండ్లో ఎస్ప్రెషనల్ బ్లాక్ ప్రోగ్రామ్ సంపూర్ణత అభియాన్ 2.0 ప్రోగ్రాం లో ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎస్ బొజ్జి రెడ్డి, ఐటిడిఏ ప్రాజెక్టర్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్, ఎస్టీ కమిషన్ మెంబర్ గొర్లె సునీత ముఖ్య అతిథులుగా హాజరైనారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎస్ బొజ్జి రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువ కానున్నాయని అన్నారు. ఎస్పిరేషనల్ బ్లాక్ సంపూర్ణత అభియాన్ 2.0 లో కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 15 మండలాలు గుర్తించడం జరిగిందని వీటిలో వై రామవరం, గంగవరం, మారేడుమిల్లి మండలాలను ఎంపిక చేశారని తెలిపారు. వై.రామవరం మండలంలోని మారుమూల గిరిజన ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు. ప్రతి పాఠశాలలో మరుగుదొడ్లు త్రాగునీరు సరఫరా అందించాలని ఆయన అన్నారు. ప్రతి గ్రామంలో విద్యార్థికి చదవడం రాయడం నేర్పించడం ఉద్దేశమని అన్నారు. జిల్లాలోని ప్రతి వ్యక్తి ఆరోగ్యంగా ఉండే విధంగా ఏజెన్సీ ప్రాంతంలోని అన్ని ఆస్పత్రులలో అన్ని రకాల వైద్య సేవలు అందించాలని దీనికోసం వైద్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. అనంతరం రంపచోడవరం ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయుచున్న సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులకు అందే విధంగా ఎన్నో కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ ఎస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాం సంపూర్ణత 2.0 ద్వారా ఆరోగ్యం,పోషణ, విద్య, వైద్యం,వ్యవసాయం, మౌలిక సదుపాయాలు, సామాజిక అభివృద్ధి సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడమే లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమం జనవరి 28వ తేదీ నుండి ఏప్రిల్ 14 వరకు మూడు నెలల పాటు జరుగుతుందని తెలిపారు. ఐసిడిఎస్ ద్వారా నాలుగు ఇండికేటర్లు ఉన్నాయని ఆరు నెలల నుంచి ఆరు సంవత్సరాల వయసులో ఉన్న పిల్లల మానసిక శారీరక ఎదుగుదల కోసం అదే విధంగా బాలింతలకు పౌష్టిక ఆహారం ఎప్పటికప్పుడు అందించడం జరుగుతుందని తెలిపారు. బాలికలకు మరుగుదొడ్లకు సంబంధించిన మరమ్మతులు ఉన్న యెడల లిఖితపూర్వకంగా సమర్పించాలని పిఓ అన్నారు. పశు సంవర్ధక శాఖ ద్వారా రైతులకు సంబంధిత వ్యాధులకు సంబంధించిన టీకాలు తప్పకుండా అందించాలని పశు వైద్యాధికారులను ఆయన ఆదేశించారు. స్థానిక బస్టాండ్ నుంచి సంపూర్ణత 2.0 ప్రోగ్రాం అవగాహన ర్యాలీ నిర్వహించడం జరిగిందన్నారు. వివిధ శాఖలకు సంబంధించిన స్టాల్స్ లను రాష్ట్ర ఎస్టీ కమిటీ చైర్మన్ ఎస్. బొజిరెడ్డి, పిఓ బచ్చు స్మరణ్ రాజ్, రాష్ట్ర ఎస్టీ కమిషన్ మెంబర్ గొర్లె సునీత సందర్శించడం జరిగిందన్నారు. ఐసిడిఎస్ ద్వారా కొంతమంది గర్భిణీ స్త్రీలకు స్థానిక నాయకులు ద్వారా శ్రీమంతం నిర్వహించడం జరిగింది. సంపూర్ణత 2.0 వాల్ పోస్టర్ని ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఆనంద్, జడ్పిటిసి వెంకటలక్ష్మి, ఎంపీటీసీ సుబ్బలక్ష్మి,ఎంపీడీవో కే బాపన్న దొర, సి డి పి ఓ లు క్రాంతి కుమారి, శాంతి కుమారి, ఎస్పిరేషనల్ బ్లాక్ అధికారి లవన్ రెడ్డి, వైస్ ఎంపీపీ జోగిరెడ్డి, వలాల విశ్వమ్మ, ఎంఈఓ జోగేశ్వరరావు, స్థానిక ఎస్సై పృధ్వి యాదవ్, వైద్యాధికారులు, సర్పంచులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, సచివాలయం సిబ్బంది,అంగన్వాడి సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.



## మాదకద్రవ్యాలపై జిల్లా లో 5 ప్రత్యేక ఈగల్ టీమ్స్ ఏర్పాటు




**జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 4 :** రాష్ట్రంలోనే మొదటిసారిగా సబ్ డివిజన్ కి ఒక ఇంచార్జ్ ముగ్గురు సిబ్బందితో ఒక ఈగల్ టీమ్ ఏర్పాటు చేశామని జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ తెలిపారు. ఈ ఈగల్ బృందాలు సాధారణ ప్రజానీకం లో సంచరిస్తూ, మాదకద్రవ్యాలపై నిరంతర నిఘా కొనసాగిస్తారన్నారు. ఏర్పాటు చేసిన 5 ప్రత్యేక బృందాలకు విధులపై జిల్లా ఎస్పీ దిశా నిర్దేశం చేసారు. తూర్పుగోదావరి జిల్లాను మాదకద్రవ్య రహిత జిల్లాగా మార్చాలనే లక్ష్యంతో రాష్ట్రంలోనే మొదటిసారిగా సబ్ డివిజన్ వారీగా ఒక ప్రత్యేక ఈగల్ టీం ను ఏర్పాటు చేసి, ఆ టీములకు ద్విచక్ర వాహనాలు ఇచ్చామన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈగల్ టీం లతో ముఖాముఖి మాట్లాడి ,చేయవలసిన విధులపై జిల్లా ఎస్పీ దిశా నిర్దేశం చేశారు. జిల్లా వ్యాప్తంగా మాదకద్రవ్యాల అక్రమ రవాణా, అమ్మకం వినియోగం వంటి వాటిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, వాటిని నిర్మూలించడానికి ఈ ప్రత్యేక టీములను ఏర్పాటు చేసామన్నారు.
గుర్తించిన గంజాయి హాట్ స్పాట్( మూసి వేయబడిన, పాడుబడిన ఇల్లు, సముదాయాలు దట్టమైన చెట్లు పొదలు ఉన్న ప్రాంతాలు) ల యందు నిరంతరం నిఘా ఉంచాలన్నారు.అవసరమైన చోట ఆకస్మిక వాహన తనిఖీలు నిర్వహించాలన్నారు.ఈ టీమ్ లన్నింటికీ డ్రోన్ వినియోగంలో ప్రత్యేక శిక్షణ ఇచ్చి, తద్వారా నిఘా పటిష్టం చేయాలన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం వలన భవిష్యత్తుపై పడే ప్రభావం, చట్టపరమైన నేరాలు, నమోదయ్యే కేసులు, వాటి తీవ్రత మరియు అమలయ్యే శిక్షల గురించి అవగాహన కలిగించాలన్నారు.ఈ టీముల ద్వారా విద్యార్థులు యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండేలా షార్ట్ ఫిల్మ్ వీడియోల ద్వారా విస్తృత స్థాయిలో అవగాహన కల్పించేందుకు జిల్లా పోలీస్ అధికారులకు దిశానిర్దేశం చేశారు.
గంజాయి , ఇతర మాదక ద్రవ్యాల కేసు ఒక్కసారి నమోదైతే, జీవితంలో తీవ్ర ప్రభావం పడుతుందని హెచ్చరించారు. అలాంటి కేసులు ఉన్నవారు పాస్పోర్ట్, వీసా పొందడంలో, ఉద్యోగ అవకాశాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటారని, ఎన్ఓసీ పొందలేని పరిస్థితులు ఏర్పడతాయని వివరించారు.
ఎవరైనా గంజాయి లేదా ఇతర మాదక ద్రవ్యాలకు అలవాటు పడినట్లయితే పోలీస్ వారికి సమాచారం అందిస్తే, సరైన కౌన్సిలింగ్ నిర్వహించి, అవసరమైతే డీ-అడిక్షన్ కేంద్రాలలో చికిత్స అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గంజాయి , ఇతర మాదక ద్రవ్యాల కార్యక లాపాలపై ఏదైనా సమాచారం ఉన్నట్లయితే, స్థానిక పోలీస్ స్టేషన్కు గానీ, డయల్ 112 లేదా 1972 నంబర్లకు గానీ తెలియజే యాలన్నారు.

## రహదారి కోసం పోరాడితే మాపై కేసుల. ఆదివాసి నాయకుడు లోత. రామారావు...

**అడ్డతీగల, పెన్ పవర్, ఫిబ్రవరి 04:** ఏజెన్సీ ముఖ ద్వారమైన ఏలేశ్వరం నుండి అడ్డతీగల రోడ్డు గురించి గత నెల 22న గిరిజన సంఘం రహదారి సాధన కమిటీ ఆధ్వర్యంలో ఏలేశ్వరం--గొంటువానిపాలెం రహదారి నిర్మించాలని, డిమాండ్ చేస్తూ కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం రమణయ్యపేట వద్ద రెండు రోజులపాటు రహదారిపై నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ నేపథ్యంలో బుధవారం ఏలేశ్వరం పోలీసులు గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా. రామారావుతో పాటు మండల, జిల్లా నాయకులు జర్తా రాజు, కోండ్ల సూరిబాబు, కాళ్ళ రాజుబాబు, పాండవుల సత్యనారాయణ, కుంజం జగన్నాథం, మట్ల వాణిశ్రీ, కె. శాంతి రాజు, ఈ. సిరిమల్లిరెడ్డి, తీగల.శ్రీను తదితర 10 మందికి వారి ఇళ్లకు వెళ్లి 41 నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా లోతా రామారావు మాట్లాడుతూ శాంతియుతంగా రహదారి కోసం ఆందోళన చేపడితే అధికారులు సమస్య పరిష్కరిస్తామని లిఖితపూర్వక హామీ ఇచ్చారని, కానీ ఇప్పటివరకు నిర్మాణం ప్రారంభించకపోగా అక్రమంగా కేసులు పెట్టి నోటీసులు జారీ చేయడం అన్యాయమన్నారు.



# ఒక్క పటిష్ట జట్టు కూడా లేదు: వరల్డ్ కప్‌లో ఆస్ట్రేలియాకు ఇంత ఈజీ డ్రానా



**హైదరాబాద్ పెన్ పవర్:** వరల్డ్ కప్ లాంటి మెగా ఈవెంట్ అనగానే ఆస్ట్రేలియాకు ఎక్కడ లేని పూనకం వస్తుంది. ద్వైపాక్షిక సిరీస్ లు ఎలా ఆడినా వరల్డ్ లో తమలోని మరో కోణాన్ని చూపిస్తారు. ఐసీసీ ట్రోఫీలంటే ఈజీగా గెలిచే ఆస్ట్రేలియా మరో ట్రోఫీపై కన్నేసింది. ఐసీసీ 2026 టీ20 వరల్డ్ కప్ కు రంగం సిద్ధమైంది. మరో మూడు రోజుల్లో ఈ టోర్నీ గ్రాండ్ గా ప్రారంభం కానుంది. భారత్, శ్రీలంకలు సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ఈ మెగా టోర్నీ 2026 ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు ఈ టోర్నమెంట్ జరగనుంది. ఈ టోర్నీలో ఆతిథ్య జట్టు ఇండియాతో పాటు ఆస్ట్రేలియా కూడా టైటిల్ ఫేవరేట్ గా బరిలోకి దిగుతుంది. షెడ్యూల్ ప్రకారం ఆస్ట్రేలియా తమ గ్రూప్ మ్యాచ్‌లన్నింటినీ శ్రీలంకలో ఆడాల్సి ఉంది. దీంతో ఇప్పటికే ఆసీస్ జట్టు కొలంబోకు చేరుకుంది. ఫిబ్రవరి 11న ఐర్లాండ్‌తో వరల్డ్ కప్ పోరును ఆస్ట్రేలియా స్టార్ట్ చేయనుంది. ఫిబ్రవరి 13న జింబాబ్వే, ఫిబ్రవరి 16న శ్రీలంక, ఫిబ్రవరి 20న ఒమన్‌తో తలపడనుంది. ఇక్కడ ఒక విషయం గమనిస్తే ఆస్ట్రేలియా ఉన్న గ్రూప్-బి లో అన్ని చిన్న జట్లే ఉన్నాయి. ప్రతి గ్రూప్ లో రెండు పెద్ద జట్లు ఉన్నప్పటికి గ్రూప్-బి లో మాత్రం ఆస్ట్రేలియాకు తిరుగులేకుండా పోయింది. జింబాబ్వే, ఒమన్,ఐర్లాండ్ జట్లు ఆసీస్ కు కనీస పోటీ ఇచ్చే దశలో లేవు. శ్రీలంక కూడా ఇటీవలే ఇంగ్లాండ్ తో టీ20 సిరీస్ ఓడిపోయి ఢీలా పడింది. స్థాయికి తగ్గట్టుగా ఆడితే గ్రూప్ 'బి' లో ఆస్ట్రేలియా ఈజీగా నాలుగు మ్యాచ్ లు గెలిచి అలవోకగా సూపర్-8 బెర్త్ కన్ఫర్మ్ చేసుకునేలా ఉంది. అసలే ఐసీసీ టోర్నీలంటే చెలరేగి ఆడే ఆస్ట్రేలియాకు తమ గ్రూప్ లో చిన్న జట్లు వేయడం ఆశ్చర్యానికి గురి చేస్తుంది. ఈ గ్రూప్ పై క్రికెట్ ఫ్యాన్స్ అసంతృప్తిగా ఉన్నట్టు తెలుస్తుంది. ఇటీవలే శ్రీలంకలో ప్రెస్ కాన్ఫరెన్స్ లో పాల్గొన ఆస్ట్రేలియా కెప్టెన్ మిచెల్ మార్ష్ తమ జట్టు టీ20 వరల్డ్ కప్ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశాడు. స్టార్ ఆటగాళ్లు స్టార్క్, కమ్మిన్స్ అందుబాటులో లేకపోయినా ఆస్ట్రేలియా జట్టు అత్యంత పటిష్టంగా కనిపిస్తుంది. 2026, ఫిబ్రవరి 7 నుంచి ప్రారంభం కానున్న టీ20 వరల్డ్ కప్ కోసం ఆస్ట్రేలియా శనివారం (జనవరి 31) తమ తుది జట్టును ప్రకటించింది. 15 మంది పేర్లతో కూడిన టీమ్‌ను అనౌన్స్ చేసింది. ఈ మెగా టోర్నమెంట్ కోసం ఆసీస్ ఇప్పటికే తమ తాత్కాలిక జట్టును ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే.. వివిధ కారణాలతో తాత్కాలిక జట్టులో పలు మార్పులు చేస్తూ శనివారం తుది జట్టును ప్రకటించింది.

ఈ టీమ్‌లో ప్రధానంగా రెండు మార్పులు చోటు చేసుకున్నాయి. వెన్ను గాయం కారణంగా పాట్ కమ్మిన్స్ మెగా టోర్నీకి దూరం కాగా అతడి స్థానంలో బెన్ డ్వార్షుయిస్‌ను ఎంపిక చేసింది. ఇక, తాత్కాలిక జట్టులో ఉన్న మాట్ షార్ట్‌ను తప్పించి అతని స్థానంలో మాట్ రెన్షాను జట్టులోకి తీసుకుంది. సీనియర్ బ్యాటర్ స్టీవ్ స్మిత్ జట్టులో చోటు దక్కించుకోలేకపోయాడు.

**2026 టీ20 వరల్డ్ కప్ కు ఆస్ట్రేలియా స్క్వాడ్:**

మిచెల్ మార్ష్ (కెప్టెన్), జేవియర్ బార్ట్‌లెట్, కూపర్ కొన్నోలీ, టిమ్ డేవిడ్, బెన్ డ్వార్షుయిస్, కామెరాన్ గ్రీన్, నాథన్ ఎల్లిస్, జోష్ హేజిల్‌వుడ్, ట్రావిస్ హెడ్, జోష్ ఇంగ్లిస్, మాథ్యూ కుహ్నెమాన్, గ్లెన్ మాక్స్‌వెల్, మాథ్యూ రెన్షా, మార్కస్ స్టోయినిస్, ఆడమ్ జంపా

# నాలుగైదు రోజుల్లో పాకిస్థాన్ దారికొస్తుంది: రవిచంద్రన్ అశ్విన్



- మ్యాచ్ జరిగితే చూడాలని ఆసక్తిగా ఉందన్న రవిచంద్రన్ అశ్విన్
- మ్యాచ్ జరగకుంటే పాకిస్థాన్ భారీ ఆర్థిక నష్టాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరిక
- ఇరుజట్ల మధ్య తటస్థ వేదికల్లో మ్యాచ్‌లు కాబట్టి వేదిక సమస్య కాదని వ్యాఖ్య

**హైదరాబాద్ పెన్ పవర్:** భారత్, పాకిస్థాన్ మధ్య క్రికెట్ మ్యాచ్ జరిగితే చూడాలని ఆసక్తిగా ఎదురు చూస్తున్నానని టీమిండియా మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ అన్నాడు. టీ20 ప్రపంచకప్ 2026 ముంగిట పాకిస్థాన్ వివాదం వేళ ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. భారత్, పాకిస్థాన్ మధ్య వంద శాతం మ్యాచ్ జరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశాడు. నాలుగైదు రోజుల్లో దాయాది దేశం దారికి వస్తుందని అభిప్రాయపడ్డాడు.వంద శాతం ఇరుదేశాల మధ్య మ్యాచ్ జరుగుతుందని ఆయన అన్నాడు. ఒకవేళ పాకిస్థాన్, భారత్ మధ్య మ్యాచ్ జరగకుంటే ఆ దేశం భారీ ఆర్థిక నష్టాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించాడు. బ్రాడ్‌కాస్టర్లు కూడా పెద్ద మొత్తంలో నష్టపోతారని, ఆ ప్రభావం అన్ని దేశాల క్రికెట్ బోర్డులపై పడుతుందని అన్నాడు. ఐసీసీ సమావేశంలోనూ ఈ అంశం చర్చకు వస్తుందని పేర్కొన్నాడు. పాకిస్థాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్) కోసం విదేశీ ఆటగాళ్లకు ఎన్ఓసీలు రావని చెప్పాడు.భారత్, పాకిస్థాన్ ఇప్పటికే తటస్థ వేదికల్లో పోటీ పడుతున్నాయని, కాబట్టి ఇక్కడ ఇరుదేశాల మధ్య మ్యాచ్‌లకు వేదిక అనేది కారణం కాదని పేర్కొన్నాడు. ఒక ప్రత్యర్థితో ఆడనని చెప్పడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని అన్నాడు. పాకిస్థాన్‌కు ఆ దేశమే శత్రువని, ఇందుకు వారి మైండ్ సెట్ కారణమని అన్నాడు. కాగా, ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు టీ20 ప్రపంచ కప్ 2026 భారత్, శ్రీలంక వేదికగా జరగనుంది. అయితే బంగ్లాదేశ్‌కు మద్దతుగా పాకిస్థాన్ ఫిబ్రవరి 15న కొలంబోలో భారత్‌తో జరగనున్న మ్యాచ్‌ను బహిష్కరిస్తున్నట్టు ప్రకటించింది.

# టీ20 వరల్డ్ కప్ పై ధోనీ ఏమన్నారంటే..!

- ఈసారి అన్నీ ప్రమాదకరమైన జట్లే ఆడుతున్నాయన్న ధోనీ
- టీమ్ ఇండియా మరింత ప్రమాదకరమైన జట్టని వ్యాఖ్య
- పొట్టి ఫార్మాట్ లో ఆటగాళ్లపై ఒత్తిడి ఎక్కువగా ఉంటుందని వెల్లడి



**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 ప్రపంచ కప్ ఈ నెల 7 నుంచి ప్రారంభం కానున్న విషయం తెలిసిందే. భారత్, శ్రీలంక వేదికగా జరగనున్న ఈ పొట్టి ప్రపంచకప్ విజేతగా నిలవబోయే జట్టు ఏదనే దానిపై మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోని తన అభిప్రాయాలను పంచుకున్నారు. ఓ ఇంటర్వ్యూలో ధోనీ మాట్లాడుతూ భారత జట్టుపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఈసారి టీ20 వరల్డ్ కప్ లో పాల్గొంటున్న జట్లన్నీ ప్రమాదకరమైనవేనని చెప్పారు.అయితే, అన్ని జట్లలోకి భారత్ మరింత ప్రమాదకరమైన జట్టు అని, మన కుర్రాళ్లు అద్భుతమైన ఫామ్ లో ఉన్నారని చెప్పారు. పొట్టి ఫార్మాట్ లో ఆటగాళ్లపై ఒత్తిడి ఎక్కువగా ఉంటుందని, భారత జట్టులోని ఆటగాళ్లు అందరికీ ఒత్తిడిలో ఆడిన అనుభవం పుష్కలంగా ఉందని అన్నారు. ఎవరు ఏ పాత్ర పోషించాలో జట్టులోని సభ్యులకు స్పష్టంగా తెలుసని ధోనీ చెప్పారు. మంచి జట్టుకు ఉండాల్సిన లక్షణాలన్నీ టీమ్ ఇండియాలో ఉన్నాయని వివరించారు.

**అదే భయపెడుతోంది..**

మ్యాచ్ జరిగే వేదికల్లో వాతావరణం తనను కలవరపరుస్తోందని ధోనీ చెప్పారు. శీతాకాలం కావడంతో కొన్ని నగరాల్లో మంచు కురుస్తోందని, మ్యాచ్ పై దీని ప్రభావం చాలా ఉంటుందని వివరించారు. ఇది చాలా విషయాలను ప్రభావితం చేస్తుందని, తాను ఆడుతున్న సమయంలోనూ డ్యూ (మంచు) అంటే భయాందోళనలకు గురయ్యానని చెప్పారు. ఇలాంటి సమయంలో టాస్ కీలక పాత్ర పోషిస్తుందని ధోని చెప్పుకొచ్చారు.



సాక్షి మాలిక్ యొక్క ఎఫర్ట్‌లెస్ జనవరి గ్లో

# నాని 'డబుల్' దూకుడు.. జోష్ కొనసాగించడం పక్కానా?



నేచురల్ స్టార్ నాని అంటే టాలీవుడ్ ప్రేక్షకులకు ముందుగా గుర్తుకొచ్చేది సహజమైన నటన, కథలకు ప్రాధాన్యత ఇచ్చే సెలెక్షన్. కెరీర్ ప్రారంభం నుంచే బాయ్ నెక్స్ట్ డోర్ ఇమేజ్ తో ప్రేక్షకుల మనసులు గెలుచుకున్న నాని, ఇప్పుడు స్టార్ హీరోగా మాత్రమే కాదు.. నిర్మాతగానూ తనదైన ముద్ర వేస్తున్నారు. హీరోగా వరుస విజయాలు సాధిస్తున్న ఆ స్టార్, నిర్మాతగా కూడా అదే జోష్ కొనసాగిస్తారా అన్న ఆసక్తి ఇండస్ట్రీలో పెరుగుతోంది. దసరాతో మాస్ అవతార్ లో అదరగొట్టిన నాని, హాయ్ నాన్నతో ఎమోషనల్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ గా ప్రేక్షకులను కట్టిపడేశారు. ఆ తర్వాత కూడా వరుస హిట్స్ అందుకున్నారు. భిన్నమైన కథలను ఎంచుకుంటూ హిట్స్ అందుకోవడం ఆయన ప్రత్యేకత. ఇప్పుడు ది ప్యారడైజ్ వంటి భారీ అంచనాలు ఉన్న ప్రాజెక్ట్ తో మరోసారి కొత్త కథతో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నారు.హీరోగా ఆయన కెరీర్ స్పీడ్ చూస్తుంటేడ మరో లెవల్ కు వెళ్లేలా కనిపిస్తోంది. ఇదే సమయంలో నిర్మాతగా కూడా నాని తీసుకుంటున్న నిర్ణయాలు ఇండస్ట్రీ దృష్టిని ఆకర్షిస్తున్నాయి. వాల్ పోస్టర్ సినిమాస్ బ్యానర్ పై కంటెంట్ బేస్డ్ సినిమాలను నిర్మిస్తూ కొత్త దర్శకులు, కొత్త కథలకు వేదిక కల్పిస్తున్నారు నాని. ఇప్పటికే హిట్ ఫ్రాంచైజ్ తో థ్రిల్లర్ జానర్ లో మంచి బ్రాండ్ క్రియేట్ చేశారు. ప్రతి పార్ట్ ప్రేక్షకులను థ్రిల్ చేస్తూ కమర్షియల్ సక్సెస్ సాధించింది. అలాగే చిన్న సినిమాగా వచ్చిన కోర్ట్ అనూహ్యంగా బాక్సాఫీస్ వద్ద లాభాలు తెచ్చిపెట్టింది. తక్కువ బడ్జెట్ తో తెరకెక్కిన ఆ చిత్రం 2025లో అత్యధిక లాభాలు సాధించిన చిన్న చిత్రాల్లో ఒకటిగా నిలవడం విశేషం. దీంతో నిర్మాతగా నాని కథలపై పెట్టే నమ్మకం, ప్లానింగ్ ఎంత పక్కాగా ఉందో మరోసారి రుజువైంది. 2026లో నిర్మాతగా నాని నుంచి ఎలాంటి సినిమాలు లేకపోయినాడ 2027 కోసం మాత్రం భారీ ప్లాన్ రెడీ చేస్తున్నారట.ఒకేసారి మూడు ప్రాజెక్టులను లైనప్ లో పెట్టడం విశేషం. అందులో ఒకటైన హిట్ 4లో తమిళ స్టార్ కార్తీ హీరోగా నటించనున్నారు. శైలేష్ కొలను దర్శకత్వంలో తెరకెక్కనున్న ఆ చిత్రం పై భారీ అంచనాలు ఉన్నాయి. కోర్ట్ దర్శకుడు రామ్ జగదీష్ తో మరో సినిమా ప్లాన్ చేస్తుండగా, దుల్కర్ సల్మాన్ హీరోగా నటించే అవకాశాలు ఉన్నాయి. తన సోదరి దీప్తి ఘంటా దర్శకత్వంలో ఒక చిన్న బడ్జెట్ సినిమా కూడా నిర్మించబోతున్నారు నాని. మొత్తానికి హీరోగా వరుస హిట్స్ తో దూసుకుపోతున్న నానిడ నిర్మాతగా కూడా అదే సక్సెస్ ట్రాక్ కొనసాగిస్తారా అన్న చర్చ మొదలైంది. కథలపై నమ్మకం, కొత్త టాలెంట్ కు అవకాశం, కంటెంట్ కు ప్రాధాన్యత.. ఇవన్నీ చూస్తుంటే వాల్ పోస్టర్ సినిమాస్ బ్యానర్ నుంచి మరోసారి విజయాల పరంపర కొనసాగడం ఖాయమే అనిపిస్తోంది. హీరోగానే కాదు.. నిర్మాతగానూ నాని డబుల్ దూకుడు చూపించడానికి సిద్ధమయ్యారనే చెప్పాలి.



పాలక్ తివారీ యొక్క బ్లాక్ గ్లామ్ మూమెంట్

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com